ప్రజాశక్తి
శనివారం 3 జూన్ 2023 8 పేజీలు
ఎన్‌టిఆర్ కృష్ణా





ప్రజాప్రతినిధుల లేఖలే ప్రామాణికం..!

ఉద్యోగుల బదిలీల్లో సిపార్సులకే పెద్దపీట?

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ఉద్యోగుల బదిలీల్లో ప్రజా ప్రతినిధుల సిఫార్సులకే పెద్ద పీట వేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బదిలీల ప్రక్రియ ప్రారంభం నుండే ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలు ఉంటేనే బదిలీ దరఖాస్తును పరిగణనలోకి తీసుకోవాలని జిల్లా ఉన్నతాధకారులు నుండి మౌఖిక ఆదేశాలు అందినట్లు సమాచారం. దీంతో జిల్లాలో ఉద్యోగుల బదిలీల వ్యవహారం పూర్తిస్థాయిలో కొలిక్కిరావడం లేదు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ శాఖలపై సిఫార్సుల ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం మే 31వ తేదీ నాటికే బదిలీ పక్రియను పూర్తి చేయాల్సి ఉన్నా, మంత్రులు, శాసన సభ్యుల సిఫార్సులతో జాబితాల్లో మార్పులు, చేర్పులు చోటు చేసుకుంటున్నాయి. దీంతో బదిలీల పక్రియ మరింత ఆలస్యమైనట్లుగా సమాచారం. గతేడాది బదిలీల్లో అధిక శాతం మంది ఉద్యోగుల బదిలీలు జరగ్గా ఈసారి అన్ని విభాగాల్లో 20 శాతం ఉద్యోగులకు మాత్రమే బదిలీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. మరో వైపు జిల్లా పరిషత్తులో జరిగిన బదిలీలు వివాదాస్పదంగా మారాయి.

జిల్లా పరిషత్తు పరిధిలో 96 మంది బదిలీ

జిల్లా పరిషత్ పరిధిలో మొత్తం తొమ్మిది కేటగిరీలకు చెందిన 96 మంది బదిలీ అయ్యారు. ఉమ్మడి జిల్లా పరిధిలో జరిగిన ఈ కార్య క్రమంలో భాగంగా నూజివీడు ఎంపీడీవో జి.రాణి ముసునూరుకు, వత్సవాయి ఎంపీడీవో ప్రసాద్ పెను గంచిప్రోలుకు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు పాత జిల్లాలోని 40 మండలాల పరిధిలో పరిపాలనాధికారులు ఏడుగురు, సీనియర్ అసిస్టెంట్లు 20 మంది, జూనియర్ అసిస్టెంట్లు 32, టైపిస్టులు 3, రికార్డు అసిస్టెంట్లు 16, ల్యాబ్ అసిస్టెంట్లు 7, లైబ్రరీ అసిస్టెంట్లు 4, ఆఫీస్ సబార్డినేట్లు ఐదుగురిని బదిలీలు చేశారు.

జిల్లాకు 14 మంది ఎంపీడీవోలు

ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతులు పొందిన 14 మందిని జిల్లాకు కేటాయిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలు చేశారు. ఏవో స్థాయి నుంచి నలుగురు, పది మంది ఈవోపీ ఆర్డీలు ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతులు పొందారు. వీరిలో 11 మంది రిపోర్ట్ చేయగా,మరో ముగ్గురు చేయాల్సి ఉంది. అయితే జిల్లా పరిషత్తు పరిధిలో ఏ బదిలీలు జరిగిన వివాదాలు చుట్టుముడు తుంటాయి. ప్రస్తుతం ఇప్పుడు కూడా అలాంటి చర్చే నడుస్తోంది. అనుకూలంగా ఉన్నవారిని యధాస్థానంలో, వ్యతిరేక ఉద్యోగులుగా భావించే వారిని జిల్లాల సరిహద్దు ప్రాంతాలకు బదిలీ చేసినట్లు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

తహశీల్దార్లకు బదిలీలు లేనట్లేనా?

రెవెన్యూ శాఖకు సంబంధించి తహశీల్దార్ల బదిలీలు కలెక్టర్ స్థాయిలో జరగాల్సి ఉంది. అయితే తహశీల్దార్లు ఎవ్వరూ బదిలీ కోరుకోకపోవడంతో ప్రస్తుతం వారి బదిలీలు దాదాపు లేనట్లేనని తెలుస్తోంది. డిప్యూటీ తహశీల్దార్లు, సీనియర్, జూనియర్, వీఆర్వోల బదిలీలపై కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన రెవెన్యూ అధికారులు బుధవారం రాత్రి సమావేశమయ్యారు. మూడు జిల్లాల పరిధిలో ఎవరైనా ఉద్యోగులు పరస్పరం బదిలీలు కోరుకుంటేనే బదిలీలు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. మంత్రులు, శాసనసభ్యుల సిఫార్సు లేఖలను బట్టి, ఒత్తిడిని బట్టి అక్కడున్న ఖాళీలను ఆధారంగా చేసుకుని బదిలీలు జరిపేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే ఏలూరు జిల్లా వెళ్లేందుకు ఉద్యోగులు ఎవరు ముందుకు రావడం లేదు. పైగా అక్కడ నుండి కృష్ణా ,ఎన్ టి ఆర్ జిల్లాలకు రావడానికి ఎక్కువమంది మక్కువ చూపుతున్నారు. దీంతో ఎలా సర్దుబాటు చేయాలో (మిగతా 6లో)



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

డిమాండ్ల సాధనకు
5 నుంచి పాదయాత్రలు

ఎపి కౌలు రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు

ప్రజాశక్తి-గన్నవరం


కౌలు రైతుల సమస్యలపై ఈ నెల 5 నుంచి జిల్లాలో జరుగుతున్న పాదయాత్రలు, రాష్ట్రంలో జరిగే జీపుయాత్రను జయప్రదం చేయాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు పిలుపునిచ్చారు. డిమాండ్ల సాధన కోసం జరపతలపెట్టిన పాదయాత్రలు, జీపుజాతాలను జయప్రదం చేయాలని కోరుతూ ఎపి కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్లను శుక్రవారం ఆయన గన్నవరంలోని సంఘ కార్యాలయంలో నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నూటికి 70 మంది కౌలు రైతులే వ్యవసాయాన్ని సాగు చేస్తున్నారన్నారు. 32 లక్షల కుటుంబాలకు చెందిన కోటిమంది ప్రజలు కౌలుపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పసుపు, వరి, జొన్న, మొక్కజొన్న తదితర పంటలకు గిట్టుబాటు ధరలు అందటం లేదన్నారు. ఈనెల ఐదో తేదీన అనకాపల్లి నుండి, 7న నెల్లూరు నుండి (మిగతా 6లో)

ఆత్మహత్యగా చిత్రీకరిస్తే ఉపేక్షించబోం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్

రాష్ట్రంలో దళితులు హత్యకు గురైతే పోలీసులే వాటిని ఆత్మహత్యలుగా చిత్రీకరిస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకష్ణ మాదిగ ఆరోపించారు. మే 10 తేదీ పెనమలూరు మండలం, పెద్దపులిపాక గ్రామపరిధిలో ఇంజనీరింగ్ విద్యార్థి జమ్ములముడి జీవన్ అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన చోటు చేసుకుంది. మందకృష్ణ శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో అడిషనల్ ఎస్పీతో జీవన్ మృతికి సంబంధించి కీలకమైన అంశాలపై చర్చించి, వినతిపత్రం అందచేశారు. అనంతరం మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. దళితుడైన జీవన్ కుమార్ హత్యకు గురయ్యాడన్నారు. 24 గంటలు గడవకముందే, పోస్టుమార్టం రిపోర్టు రాకముందే ఆత్మహత్యగా పోలీసులు ఎలా ప్రకటించారని ప్రశ్నించారు. జిల్లా ఎస్పీ నిందితులకు కొమ్ము కాయడం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోందన్నారు. పోస్టుమార్టం రిపోర్ట్ రాకుండానే ఒక ఉన్నతాధికారి ప్రెస్ మీట్ పెట్టటం అనుమానాలకు తావిస్తోందన్నారు. దీన్నిబట్టి హత్యను నిందితులతో కుమ్మక్కై ఆత్మహత్యగా పోలీస్ యంత్రాంగం చివరికి ఉన్నత అధికారులు కూడా కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేసును నీరుగార్చే విధంగా ప్రయత్నం చేస్తున్నారనడానికి ఎస్పీ స్టేట్మెంట్ సాక్ష్యంగా కనిపిస్తోందన్నారు. పోస్టుమార్టం పద్ధతి ప్రకారం జరగలేదన్నారు. డెడ్ బాడీ ఉన్న స్థితిలో అలాగే కుటుంబ సభ్యులకు అప్పజెప్పారన్నారు. దీంతో పోస్టుమార్టం చేయలేదని స్పష్టం అవుతుందన్న అనుమానాలు వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు జీవన్ కుమార్ పాల్పడి చనిపోతే తెచ్చుకున్న పెట్రోల్ బాటిల్ కూడా అక్కడే ఉండేదన్నారు. అయితే అక్కడ (మిగతా 6లో)



అడిషనల్ ఎస్‌పికి వినతిపత్రం అందజేస్తున్న మందా కృష్ణమాదిగ

200 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల మండలం కీసర టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయి తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. నందిగామ రూరల్ సిఐ ఐవి నాగేంద్రకుమార్ ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ పివియస్ సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం కీసర టోల్‌ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో హైదరాబాద్ వైపు వెళ్తున్న బొలేరో వాహనంపై అనుమానం వచ్చి ఆపి తనిఖీ చేశారు. గంజాయిని గుర్తించి వెంటనే వాహనంలో ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్ కు తరలించారు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులు రాజమండ్రి నుండి మధ్యప్రదేశ్‌లోని భోపాల్ కు గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిసింది. పట్టుబడిన గంజాయి సుమారు 200 కిలోలు ఉంటుందని పోలీసులు తెలిపారు.



పట్టుబడిన గంజాయి

సివిల్స్ ర్యాంకర్లకు ఘన సత్కారం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసంతో పాటు చక్కటి ప్రణాళికతో సివిల్స్‌లో విజయం సాధించవచ్చని పలువురు వక్తలు అన్నారు. యుపిఎస్‌సి అఖిల భారత సివిల్ సర్వీసెస్ పరీక్షలలో ర్యాంకులు సాధించిన తెలుగు తేజాల అభినందన సభ శుక్రవారం సాయంత్రం నగరంలోని ఎంబి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా సివిల్స్‌లో 311వ ర్యాంకు సాధించిన వీరగంధం లక్ష్మీ సుజాత, 462వ ర్యాంకు సాధించిన బొల్లిపల్లి వినూత్న, 550వ ర్యాంకు సాధించిన రేపూడి నవీన్ చక్రవర్తి, 593వ ర్యాంకు సాధించిన తలియా హేమంత్, 805వ ర్యాంకు సాధించిన మన్నం సుజిత్ సంపత్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అతిథిగా పాల్గొన్న ప్లానింగ్ శాఖ సెక్రటరీ జి.యస్.ఆర్.కె.ఆర్ విజయకుమార్ మాట్లాడుతూ చాలా మంది సివిల్స్ కష్టమని మనకు రాదులే మనకు ఎందుకు అనుకుంటారని అది చాలా తప్పని అన్నారు. కర్మతో సంబంధం లేకుండా శ్రమ, కష్టంతో విజయం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరిలోనూ అద్భుతమైన మేథస్సు ఉందని, ప్రయత్నిస్తే విజయం సాధించడం సులువేనన్నారు. సివిల్స్‌లో మంచి ర్యాంకు సాధిస్తే ఐఎఎస్‌తో పాటు ఐపిఎస్ వంటి అత్యున్నతస్థాయి పదవిలో పేద ప్రజలకు సేవ చేసే మంచి అవకాశం దక్కుతుందన్నారు. అలాగే వివిధ హోదాలలో పనిచేసే సందర్భాలలో జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం కూడా ఉందని సూచించారు. అణగారిన, పేద వర్గాలకు సేవ చేసే అవకాశం అత్యున్నత స్థాయి ప్రభుత్వ సర్వీసులోనే సాధ్యమవుతుందని తెలిపారు. మైనారిటీ శాఖ సెక్రటరీ ఎ.ఎం.డి. ఇంతియాజ్ మాట్లాడుతూ ఇటీవల విడుదలైన సివిల్స్ పరీక్షలో మన రాష్ట్రానికి చెందిన వారు (మిగతా 6లో)



బాల్య వివాహాలను అరికట్టాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ : బాల్య వివాహలను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, బాల బాలికలపై లైంగిక వేధింపులు, చిన్నారుల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అంశాలపై శుక్రవారం కలెక్టరేట్‌లోని లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ ఎస్. డిల్లీరావు సంబంధిత శాఖల అధికారులు, చైల్డ్ లైన్ సభ్యులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఏర్పాటైనా జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాల్య వివాహం జరిగినట్లు గుర్తిస్తే తరువాత కూడా తల్లిదండ్రులు, పురోహితులు, పాస్టర్, ఖాజీలపై కూడా కేసులు నమోదు చేసినప్పుడే బాల్యవివాహాలను అరికట్టగలుగుతామని బాల్య వివాహనపై పోలీసులు కేసులు నమోదే చేయకపోతే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. బాల్య వివాహాల నిరోధక చట్టం- 2006లో చేసిన మార్గదర్శకాలను అనుసరించి సిడిపివోలు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బంది, ఎంఎస్ కె పోలీసులు బాల్య వివాహాల దురాచారాన్ని అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలపై లైంగిక వేధింపులు, చిన్నారుల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రణాళికతో ముందుకు వెళ్ళాలన్నారు. బాల్య వివాహాలు జరిగినట్లు గుర్తిస్తే వధువు వరులకు సంబంధించి జనన ధృవీకరణ పరిశీలన కోసం సమీపంలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి నిర్ధారణ చేసుకోవాలన్నారు. పాఠశాల చదువు మధ్యలో ఆపేసిన వారికే ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నాయని, ఈ అంశంలో గ్రామాల్లో పనిచేస్తున్న వివిధ శాఖల సిబ్బంది ఆయా కుటుంబాల నేపథ్యాలను పరిశీలించి ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎ. కొండూరు, రెడ్డిగూడెం, విస్సన్నపేట, మైలవరం మండలాలలో అధికంగా బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయన్నారు. లైంగిక వేధిపులు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాలికల అక్రమ రవాణ వంటి సమాచారాన్ని 1098 చైల్డ్ లైన్ నెంబర్ కు తెలియజేస్తే తక్షణమే స్పందించి సహాయం చేసేందుకు ముందుకు వస్తారనే విషయాన్ని ప్రతి గ్రామంలో విస్తతంగా ప్రచారం చేయాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు కోరారు. ఈ సమావేశంలో మహిళ శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ జి. ఉమాదేవి, జిల్లా విద్యా శాఖాధికారిణి సివి రేణుక, వాసవ్య మహిళ మండలి అధ్యక్షురాలు కీర్తి, సిడబ్ల్యుసి సభ్యుడు భార్గవ్, జిల్లా చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ ఆరవ రమేష్, జిల్లాకు చెందిన సిడిపివోలు జి. మంగమ్మ, లక్ష్మి భార్గవి, రేణుక, పుష్పలత, నాగమణి, ఝాన్సీ, లలిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సచివాలయాల మహిళ పోలీసులు పాల్గొన్నారు.



సేవలు ప్రారంభిస్తున్న ఐఆర్‌ఎస్ ఐజి కమిషనర్ రామకృష్ణ

రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభం

- ఐఆర్‌ఎస్ ఐజి కమిషనర్ రామకృష్ణ

గుడివాడ : మొదటి ఫేజ్‌లో గ్రామ సచివాలయలో 51 రిజిస్ట్రేషన్ సేవలను ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌ఎస్ ఐజి కమిషనర్ జి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం గుడివాడ రూరల్ మండలంలోని లింగవరంలోని మెరకగూడెంలోని సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలను ఐ.ఐ అడ్వజర్ శేషగిరి, జనరల్ ఇన్‌స్పెక్టర్ టి.సౌజన్య, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్రతో కలిసి సచివాలయంలో రిజిస్ట్రార్ ఐజి రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సేవలను ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. 1పేజ్‌లో విడతగా 51 గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు ప్రారంభించామన్నారు. రెండ పేజ్‌లో 19458 సచివాలయాల్లో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

- జిల్లా విద్యాశాఖ అధికారి తహెరా సుల్తాన

గుడివాడ : స్థానిక ఎస్‌పిఎస్ స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి తహెర సుల్తాన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుండి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కళాశాలను గుడివాడ పట్టణంలోని బాలికలు ఉపయోగించుకోవాలన్నారు. గతేడాది ఈ పాఠశాలలో బాలికల జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారన్నారు. అద్భుతమైన ప్రగతి ఈ కళాశాల సాధించిందన్నారు. పూర్తి ఉచితంగా ఈ కళాశాలలో విద్యను అభ్యసించొచ్చునన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - మొవ్వ : వేసవి విజ్ఞాన శిభిరం బాలల్లో శారీరక, మానసిక వికాసం, సృజనాత్మక పెంపొందించే విధంగా కొనసాగుతుందని మొవ్వ శాఖా గ్రంథాలయ పాలకురాలు టి.కష్ణకుమారి అన్నారు. వేసవి శెలవులు సద్వినియోగం చేసుకునే క్రమంలో చిన్నారులు పుస్తక పఠనం, క్రీడలు, పేపరు క్రాఫ్ట్ తయారీలో ఆసక్తి కనబరుస్తూ అద్భుత కళానైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారన్నారు. చిన్నారుల అభిరుచులకనుగుణంగా రూపకల్పన చేసిన వేసవి విజ్ఞాన శిభిరం వారిని మేధో సంపన్నులుగా, ఆరోగ్యవంతమైన భారతీయ పౌరులుగా, సృష్టికర్తలుగా తీర్చిదిద్దేందుకు చక్కటి వేదికగా నిలిచిందని చెప్పారు. శిభిరంలో భాగంగా శుక్రవారం చిన్నారులకు పేపర్ క్రాఫ్ట్ కాంపిటిషన్ నిర్వహించి ,ఖోఖో ఆడించామని ,శెలవుల్లో సరదాగా వేసవి శిభిరంలో భాగంగా వర్క్ బుక్ లోని పలు అంశాలను చిన్నారులతో చేయించామన్నారు. శిబిరంలో 30 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు గ్రంథాలయ పాలకురాలు టి.కృష్ణకుమారి వివరించారు.



అంబేద్కర్, జగ్జీవన్‌రాం విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న మందా కృష్ణామాదిగ

ప్రజాశక్తి-వత్సవాయి : కులవివక్ష నిర్మూలన ధ్యేయంగా ప్రముఖ నాయకులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రావులు పాటుపడ్డారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకష్ణ మాదిగ అన్నారు. శుక్రవారం మండలంలోని కన్నెవేడు గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రావు విగ్రహాలను ప్రారంభిం చారు. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా భారతదేశంలో కులవ్యవస్థత పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో కొన్ని కులాల వారికే కొన్ని అవకాశాలు దక్కుతున్నాయని పేర్కొన్నారు. చదువు ద్వారానే అభివద్ధి జరుగుతుందని తెలిపారు. మహారాష్ట్రలో పుట్టిన జ్యోతిరావు పూలే కూడా మహిళలు చదువుకోవాలని అంటరానితన నిర్మూలన కోసం కృషి చేశారన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో బాబు జగ్జీవన్ రావ్ కీలకపాత్ర పోషించారని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ఏర్పాటు కోసం ఎనలేని కషి చేశారని తెలిపారు. జులై7న హైదరాబాదులో జరిగే ఎమ్మార్పీఎస్ రిజర్వేషన్ కోసం ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సేవా దుర్గారాణి, ఎంఈఎఫ్ నాయకులు కుక్కల సురేష్ కుమార్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కర్ణాటిఅప్పారావు, మక్కపేట గ్రామ సర్పంచ్, గుడేటి సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- ఎపి రైతుసంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు రాజులపాటి రామాంజనేయ ప్రసాద్



ప్రజాశక్తి-పమిడిముక్కల : రైతుల వద్ద ఇంకా పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని పూర్తిస్థాయిలో రాష్ట్రప్రభుత్వం కొనుగోలు చేయాలని ఎపి రైతుసంఘం కృష్ణాజిల్లా అధ్యక్షులు రాజులపాటి రామాంజనేయ ప్రసాద్ డిమాండ్ చేశారు. పమిడిముక్కల మండలం హనుమంతపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పర్యటించిన పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను కలిసి రైతులు, కౌలురైతులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించానన్నారు. భూయజమాని సంతకం నిబంధన సడలించి గ్రామసభల ద్వారా కౌలురైతులందరికి గుర్తింపు కార్డులిచ్చి బ్యాంకు రుణం, రైతు భరోసా, పంటల భీమా, పంటనష్ట పరిహార , పంట అమ్ముకునే అవకాశం ఇవ్వాలని కోరారు. భూయజమాని సంతకం సడలించి అందరికీ గుర్తింపు కార్డులిచ్చి రాష్ట్రప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప జేయాలన్నారు. అకాలవర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ఇవ్వాల్సిన పరిహారాన్ని వెంటనే అందజేయాలని డిమాండ్‌చేశారు. రైతుల వద్ద ఇంకా పెండింగ్‌లో ఉన్న ధాన్యం, పసుపు, మొక్కజొన్నలను పూర్తిస్థాయిలో కొనుగోళ్లు చేయాలని కోరారు. ధాన్యం విక్రయించిన రైతులు, కౌలు రైతులకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలు తక్షణమే ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. హనుమంతపురంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరగా ఎమ్మెల్యే చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

సచివాలయం సందర్శన



ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని కొలిం బజార్‌కు సంబంధించిన వాలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు విధులలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తన దష్టికి వచ్చినట్లు మున్సిపల్ చైర్మన్ సిహెచ్ మల్లేశ్వరరావు తెలిపారు. శుక్రవారం 12వ సచివాలయంను మున్సిపల్ కమిషనర్ సందర్శించారు. ప్రభుత్వం వారు నిర్వహిస్తున్న జీ.వీ.డి, జగనన్న తోడు, ఎస్.డి.జి. మొదలగు వాటిలో ఎక్నాలజీ మెంట్ తీసుకోవడంలో మిగిలిన సచివాలయల కన్నా వెనుకబడి ఉన్నారని కమిషనర్ అన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు రిపోర్ట్ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

30 వరకూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనా మాసోత్సవం

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, అమరావతి సూచనల మేరకు జాతీయ బాలకార్మిక వ్యస్థ నిర్మూలన మాసోత్సవం ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించాలని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పేర్కొందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి. రామకృష్ణయ్య అన్నారు. శుక్రవారం మచిలీపట్నం లోని జిల్లా కోర్టు ప్రాంగణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సమావేశ మందిరంలో కార్మిక శాఖ, పోలీసు, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమం, రెవెన్యూ, చైల్డ్ లైన్, బచ పన్ బచావో, సి డబ్ల్యూ సి, పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కృష్ణాజిల్లా కార్మిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాల కార్మికులను గుర్తించి బాల కార్మిక నిర్మూలన మాసోత్సవ నిర్వహణపై ప్రత్యేక సమావేశం జరిగింది. బాలల చేత ఎవరైనా పనులు చేయించుకున్నట్లయితే మచిలీపట్నం డివిజన్‌కు సంబంధించి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి ఎస్ గోవింద్ 9492555104, గుడివాడ డివిజన్ కు సంబంధించి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారి వి. చక్రధర్ 9492555097లకు ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చైల్డ్‌లేబర్‌ను ప్రోత్సహిస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటే కొంతమేరకు బాల కార్మికులను పనిలో పెట్టుకునే విధానాన్ని నియంత్రించొచ్చునన్నారు. అనంతరం బాల కార్మిక నిర్మూలన మాసోత్సవానికి సంబంధించిన ఒక బ్రోచర్ ను లాంఛనంగా విడుదల చేశారు. ఈ సమావేశంలో దిశా డి.ఎస్.పి యు. నాగరాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ డిస్టిక్ కో- ఆర్డినేటర్ , దిశా ఫ్యామిలీ కౌన్సిల్ మెంబర్ అడ్వకేట్ రెహం తున్నిసా బేగం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయలక్ష్మి, సమగ్ర శిక్ష అభియాన్ తరపున రామకృష్ణ, విద్యాశాఖ సంబంధించి డివైఇఒ యు.వి సుబ్బారావు, దిశా ఎస్సై రవికుమార్, వాసవి మహిళా ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ ఆకుల వాసవి, విజయ వివిధ శాఖల అధికారులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

12 నాటికి నాడు-నేడు పనులు పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : మనబడి నాడు- నేడు పథకం కింద జిల్లాలో వివిధ పాఠశాలల్లో చేపట్టిన కొత్త టాయిలెట్స్, కిచెన్ షేడ్స్ ,అదనపు తరగతి గదులు నిర్మాణం, పాత వాటికి మరమ్మత్తు పనులు, విద్యుదీకరణ పనులు ఈనెల 12 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లో నాడు- నేడు పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ పాఠశాలల్లో రన్నింగ్ వాటర్ తో కొత్త టాయిలెట్లు, కిచెన్ షెడ్లు నిర్మాణం కొన్ని పాఠశాలలో పాత వాటికి మరమ్మత్తులు, అదనపు తరగతి గదుల మేజర్, మైనర్ మరమ్మత్తు పనులు మొత్తం 1723 పనులు చేపట్టామన్నారు. చేపట్టిన పనుల్లో 752 పనులు 90 శాతం, 556 పనులు 60 శాతం, 231 పనులు 40 శాతం పూర్తికాగా, 184 పనులు 20 శాతం పూర్తయ్యాయన్నారు. 90 శాతం, 60 శాతం పూర్తయిన పనులపై దష్టి సారించాలని, వారంలోగా పురోగతి సాధించి పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.రన్నింగ్ వాటర్ తో టాయిలెట్లు కిచెన్ షెడ్ల నిర్మాణం మరమ్మత్తులు పనులు జూన్ 12 పాఠశాలలు తెరిచే నాటికి పూర్తిచేయాలని అన్నారు. చేపట్టిన పనులు పూర్తి చేయుటకు ప్రణాళికాబద్ధంగా కషి చేయాలి పనులు చేపట్టిన పాఠశాల పరిధిలోని సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్, పాఠశాల హెచ్ఎం, పనులు చేపట్టిన ఏజెన్సీ అధికారుల తో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేయాలని జిల్లా కలెక్టర్ ను కూడా గ్రూపులో యాడ్ చేసి ప్రతిరోజు పనుల పురోగతిపై ఫోటోలు అప్లోడ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనులు చేపట్టిన ఏజెన్సీ శాఖల అధికారులు సర్వ శిక్ష అభియాన్, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఏపీ విద్యా సంక్షేమ మౌలికవసతుల అభివద్ధి సంస్థ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిరోజు ఫీల్డ్ విజిట్ చేయాలని, పనులు పురోగతిపై నివేదికలు సమర్పించాలన్నారు. పనులు చేస్తున్న మేస్త్రి పేరుతో సహా నివేదికలో పేర్కొనాలని, ఫీల్డ్ లో లేని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్, సమగ్ర శిక్ష ఏపీసి డాక్టర్ ఏ .శేఖర్, ఏపీ విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివద్ధి సంస్థ ఈ ఈ సోమేశ్వరరావు, పంచాయతీరాజ్ ఈ ఈ ఏవీఎస్ శ్రీనివాసరావు, డిఈలు, ఏఈలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు



కళాజాతా ద్వారా అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అనర్థాలపై కళాజాతా

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వినియోగం వల్ల ప్రస్తుత, ముందు తరాలకు కలిగే అనర్థాలు తెలియజేస్తూ కళాకారుల బంధం శుక్రవారం ఉయ్యూరులో కళాజాతా నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం వల్ల కలిగే అనర్థాలు, మిషన్ లైఫ్లో లో జీవన విధానం మెరుగు పరుచుకునే విధంగా అవలంభించవలసిన అంశాలు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షణ చేపట్టవలసిన ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యం తీసుకోవలసిన జాగ్రత్తలు ప్రదర్శనలో అవగాహన కల్పించారు. అమరా వతి కల్చరల్ ఆర్గనైజేషన్ గుడివాడ కళాకారుల బందం వీరయ్య, రవితేజ పాల్గొన్నారు.

టిడిపితోనే జనరంజక పాలన

ప్రజాశక్తి-గన్నవరం : టిడిపి తోనే జనరంజక పాలన వస్తుందని పలువురు టిడిపి మహిళా నాయకులు పేర్కొన్నారు. పాత గన్నవరంలో టిడిపి గన్నవరం పట్టణ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ రావు పుట్టినరోజు వేడుకలను తిరుపతమ్మ మాతమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీధర్ కేక్ కట్ చేసి మహిళలకు పంపిణీ చేశారు. అందరూ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలు మాట్లాడుతూ.. గన్నవరం ప్రాంతంలో టిడిపి అభివద్ధికి శ్రీధర్ శక్తివంచన లేకుండా కషి చేస్తున్నట్లు చెప్పారు. జగన్ పాలనలో అస్తవ్యస్తంగా రాష్ట్రం తయారయిందని విమర్శించారు. రానున్నది చంద్రబాబుకు ప్రభుత్వం అని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండవ లక్ష్మి, మోదుగు మూడి వేణు తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న జాస్తి శ్రీధర్

10న గన్నవరం నుంచి వేళంగిణికి బస్సు

ప్రజాశక్తి-గన్నవరం : ఈనెల 10వ తేదీ శనివారం మధ్యాహ్నం 12.00 గంటలకు గన్నవరం నుండి నాగపట్నం కు ఆర్టీసీ బస్సు బయలుదేరుతుందని డిపో మేనేజర్ శివాజీ తెలిపారు. 11వ తారీకు ఉదయం నాగపట్నం చేరుకొని, ఆరోజు వేళాంగిణి మాత దర్శనం, దివ్య బలిపూజ చూసి రాత్రికి అక్కడే బస చేసి 12వ తేదీ ఉదయం బయలుదేరతారన్నారు.12వ తేదీ మధ్యాహ్నం చెన్నైలో సెయింట్ థామస్ వారి సమాధి దర్శించుకుని, సాయంత్రం చెన్నై మెరినా బీచ్ చూసి, రాత్రి బయలుదేరి 13వ తేదీ ఉదయం 10 గంటలకు గన్నవరం చేరుకుంటారన్నారు. సూపర్ లగ్జరీ బస్సు పుష్ బ్యాక్ టికెట్ ధర రూ.3400అని, భక్తులు ఈ సదవకాశమును వినియోగిం చుకోవాలని కోరారు.

విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ

ప్రజాశక్తి-ఉయ్యూరు : స్థానిక శాఖా గ్రంధాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ నిచ్చారు. కథల పుస్తకాలు చదివించి అందులో నీతి గురించి తెలియజేశారు. మానవ శరీరంలో నేత్రం విశిష్టత, కంటిలో భాగాలు తీసుకోవలసిన జాగ్రత్తలు రిసోర్స్ పర్సన్ ఇ.కోటేశ్వరరావు వివరించారు. బీడీసీ సోని, గ్రంధాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పద బ్యానర్లు తక్షణమే తొలగించాలి : టిడిపి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నంలో ప్రతిపక్ష పార్టీ నేతలను కించపరుస్తూ పేర్ని కిట్టు ఏర్పాటుచేసిన బ్యానర్లను తక్షణమే తొలగించాలని లేకపోతే బందరులో శాంతిభద్రతలు అదుపుతప్పే ప్రమాదం ఉందని తెలుగుదేశం పార్టీ నేతలు జిల్లా కలెక్టర్కు, జిల్లా ఎస్పీకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మచిలీపట్నంలో గత నాలుగు రోజులుగా బ్యానర్ల వివాదం నలుగుతుంది దీనిపై ఇప్పటివరకు స్థానిక నగరపాలక సంస్థ గాని పోలీసులు గాని ఎలాంటి చర్యలు తీసుకుపోకపోవడంతో ప్రజల్లో ఆగ్రహ ఆవేశాలు ప్రజ్వరిల్లే పరిస్థితి ఏర్పడిందని తెలుగుదేశం నేతలు పేర్కొన్నారు. అగ్గికి ఆజ్యం పోసినట్టు పోలీసులు ఒక వర్గాన్ని కొమ్ముకాసేలా వైసిపి పార్టీకి కొమ్ముకాస్తూ సమస్యను ఇంకా జటిలం చేసే విధంగా వ్యవహరిస్తున్నరన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఈ ఫ్లెక్సీలు వివాదం పై దష్టి సారించి ఈ సమస్యలకు మూల కారణమైన బ్యానర్లను తొలగించి శాంతి భద్రతలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం వి.బాబా ప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఇలియాస్ పాషా, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షురాలు కార్పొరేటర్ దేవరపల్లి అనిత, కార్పొరేటర్ సుధాకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న టిడిపి నాయకులు

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : పరిసరాల పరిశుభ్రత ఇతర జాగ్రత్తలు తీసుకోవాడం ద్వారా దోమకాటు వల్ల వచ్చే మలేరియా ఇతర వ్యాధుల భారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కాటూరు పీహెసీ అధికారి జి.దీప అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవం పురస్కరించుకుని బోళ్లపాడులో శుక్రవారం అవగాహన ర్యాలీ, రచ్చబండ వద్ద సమావేశం నిర్వహించి దోమకాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దోమలు వద్ధిచెందకుండా ఇంటి పరిసరా ల్లో నీరునిల్వకుండా చూడాలన్నారు. దోమతెరలు ఉపయోగించి దోమలుకుట్టకుండా చూసుకోవాలన్నారు. దోమకాటువల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్యా, బోదకాలు, మెద డవాపు వ్యాధులు సంక్రమిస్తాయన్నారు. జ్వరం వచ్చిన వెంటనే ఆశావర్కరు, ఆరోగ్యకార్యకర్త, ఆరోగ్య కేంద్రంను సంప్రదించి మలేరియా నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. దోమలు పెరగకుండా తీసుకుంటున్న చర్యలను గ్రామ సర్పంచ్ టి. సురేష్ రెడ్డి తెలియజేశారు ఎంపీటీసీ టి. గంగారత్నం, ఎం పీహెచ్ పి. నాగార్జున బాబూ రావు, జి. రత్నబాబు, కె.శ్రీనివాసరావు, ఎంవి రమణ ఏఎన్ఎంలు, అశావర్కర్లు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు కార్డులివ్వాలి

- కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : కౌలుకు సాగు చేసి పంటలు పండించే కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలుదారుల కార్డులు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు అన్నారు. శుక్రవారం మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావుకు సిసిఆర్సి కార్డుల సవరణకు సంబంధించిన వినతి పత్రాన్ని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీ శైలజ తో కలిసి అందించారు. జిల్లాలో రెండు లక్షలకు పైగా కౌలు రైతులు ఉన్నారని, వ్యవసాయంలో 80 శాతం మంది పైగా కౌలు రైతులే సాగు చేస్తున్నారని, వీరందరికీ కౌలుదార్ కార్డులు ఇవ్వాలంటే భూ యజమాని సంతకం తప్పనిసరిగా ప్రభుత్వం చేసిందని దీనిని సవరించి భూ యజమానితో సంబంధం లేకుండా కౌలుదార్ కార్డులు ఇప్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. భూయజమానులు వారి సొంత బంధువులకు మాత్రమే సంతకాలు పెట్టడంతో బోగస్ కార్డులు వస్తున్నాయని దీనిని అరికట్టాలంటే నిజమైన కవులు దారులకే కార్డులు ఇవ్వాలని కోరారు. వాస్తవ కవులు దారులకు కార్డులు రాకపోవడంతో బ్యాంకుల నుంచి రుణాలు, కౌలుదారులకు రావలసిన రాయితీలు రాకపోవడంతో వ్యవసాయాన్ని సాగు చేయడానికి రైతులు ముందుకు రావడంలేదని దీంతో వ్యవసాయ సంక్షోభం ఏర్పడుతుందని రానున్న కాలంలో వ్యవసాయం బాగుపడాలంటే కౌలుదారుల కార్డులు నిజమైన కౌలుదారులను గుర్తించి భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా ఇవ్వాలని కోరారు. ఈ వినతి పత్రం అందించిన వారిలో ఖమ్మం కొండలు, సేలం ప్రకాష్ రావు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ బీమాపై అవగాహన

ప్రజాశక్తి-గన్నవరం(ఉంగుటూరు) : వైఎస్సార్ భీమా నమోదు కార్యక్రమంపై శుక్రవారం ముక్కపాడు సచివాలయంలో ఎంపిడిఓ శేషగిరిరావు అధ్యక్షతన వాలంటీర్లకు, సచివాలయం సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండిఒ మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న కుటుంబాన్ని పోషించే వ్యక్తి సహజంగా లేదా ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబాలకు ఆర్థికంగా అండగా వైఎస్సార్ భీమా ని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. దీనికి 18-70 ఏళ్ళ లోపు వయసున్న వాళ్ళు అర్హులని, దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న వాళ్ళు అర్హులు 18-50 ఏళ్ళ లోపు అర్హులన్నారు. కుటుంబ పెద్ద సహజంగా మరణిస్తే ఒక లక్ష రూపాయలు , 18-70 ఏళ్ల లోపు కుటుంబ పెద్ద ప్రమాదవశాత్తు మరణిస్తే 5 లక్షల రూపాయలు భీమా కింద వస్తాయన్నారు. వైఎస్సార్ భీమా పథకంకు సంబంధించి 2023-24 కు సంబందించి రెన్యువల్ /ఎన్ రోల్డ్ గ్రామ వార్డు సచివాలయంలోని వాలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ఎటువంటి తప్పులు లేకుండా ఈ నెల 7వ తేదీలోపు ఆప్లోడ్ చేయాలన్నారు. మండలములోని అర్హులైన ప్రజలు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు.

చిరుధాన్యాలతో మంచి ఆరోగ్యం

ప్రజాశక్తి.. గన్నవరం(ఉంగుటూరు) : మిషన్ లైఫ్ ప్రోగ్రాం ప్రచారంలో భాగంగా శుక్రవారం ముక్కపాడు గ్రామములో ఎండిఒ జి.ఎస్.వి శేషగిరిరావు పాల్గొని చిరుధాన్యాల ఉపయోగాల గురించి తెలిపారు. పోషక విలువలున్న విటమిన్ బి12, బి17, బి6, ,ఎక్కువ పీచుపదార్థాలు కలిగి ఆహారం తీసుకోవడం ద్వారా తల్లులకు, పిల్లలకు మంచి ఆరోగ్యముతో పాటు వ్యాధి నిరోధిక స్థితి పెరుగుతుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రతి రోజు మనము తీసుకునే ఆహారములో చిరుధాన్యాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రాగులు, జొన్నలు, సజ్జలు, అరికెలు ,సాములు, కొర్రలు మొదలైనవి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురికాకుండా ఎముకలు పటుత్వం కలిగి ఉంటారని చెప్పారు.



ఎర్రమాడు పాలకేంద్రం సందర్శన

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు పాలశీత ల కేంద్రం పరిధి లోని ఎర్రమాడు పాల కేంద్రాన్ని కష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు శుక్రవారం సందర్శించారు. దేశంలోనే ఏవ్యవస్థలో అయిన తమవద్ద ఉన్న పాలకు రేటు నిర్ణయిం చుకునే అధికారం ఒక కష్ణా మిల్క్ యూనియన్ కు మాత్రమే ఉందన్నా రు. 10శాతం ఫ్యాట్ కు రూ. 80 రేటు ను చెల్లించడం జరుగుతుంన్నారు. కష్ణా మిల్క్ యూనియన్ పశుసం చార వైద్యం ద్వారా నిరంతరం డాక్టర్లు అందుబాటులో ఉంటూ పశువులకు ఉచిత క్యాంపులు ద్వారా రైతుల ఇంటి వద్దనే వైద్యం చేస్తున్నట్లు చెప్పారు. ఈకార్యక్ర మంలో సంఘ అధ్యక్షురాలు టి.లక్ష్మీకాంతమ్మ, జిల్లా ట్రస్ట్ సభ్యులు పల్నాటి సత్యనారా యణ, తిరువూరు చిల్లింగ్ సెంటర్ మేనేజర్ టి. సాంబశివమూర్తి, రూట్ సూపర్వైజర్ పి.ప్రసాద్, వేతన కార్యద ర్శి టి.బాలకష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ రక్షణనిధి

ముగిసిన 'గడపగడపకూ మనప్రభుత్వం'

ప్రజాశక్తి - గంపలగూడెం : గడిచిన మూడేళ్లుగా వైసీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివద్ధి వెరసి 31 కోట్లు ఖర్చు చేసినట్లు తిరువూరు శాసనసభ్యులు కొక్కిలిగడ్డ రక్షణ నిధి తెలిపారు. శుక్రవారం గంపలగూడెం లో గడపగడపకు మన ప్రభుత్వం ముగించిన అనంతరం ఆయన మాట్లాడారు.సచివాలయం-2 పరిధిలో తొమ్మిది కోట్ల రూపాయలు సంక్షేమ పథకాలకు ఖర్చు చేసినట్లు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో భాగంగా రెండు సచివాలయ పరిధిలో 40 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు అందులో 30 లక్షలు ప్రజల అవసరార్ధం నీటి సరఫరా కి మాత్రమే ఉపయోగించనున్నట్లు తెలిపారు. తదుపరి 10 లక్షలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు వినియోగించాలని ఆదేశించారు.తమ ప్రభుత్వంలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఉద్ఘాటించారు.గత ఆరు రోజులుగా కొనసాగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సహకరించిన ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు, అధికారులకు, రక్షణ నిధి ప్రత్యేకంగా కతజ్ఞతలు తెలిపారు.

వడదెబ్బకు యాచకుడు మృతి



మృతుడు సీతారాములు

ప్రజాశక్తి-కంచికచర్ల : ఎండ తీవ్రతకు తట్టుకోలేక వడదెబ్బ లక్షణాలతో భిక్షాటన చేసే యాచకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం స్థానిక చెవిటికల్లు రోడ్డు సెంటర్‌లో జరిగింది. సేకరించిన సమాచారం మేరకు తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా, మధిర మండలం మడిపల్లి గ్రామానికి చెందిన గౌరవరపు సీతారాములు (68) కొంత కాలంగా కంచికచర్ల వచ్చి భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం ఎండ తీవ్రతకు తట్టుకోలేక స్థానిక చెవిటికల్లు సెంటర్‌లో గల మేరీ మాత గుడి వెనకాల డ్రైనేజ్ బండమీద సొమ్మసిల్లి పడిపోయి కొద్దిసేపటి మతి చెందాడు. మతుడు సీతారాములకు ఇద్దరు మగపిల్లలు, ఒక ఆడపిల్ల ఉన్నట్లు బంధువులు తెలిపారు.

అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టొద్దు



ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రధాన కార్యాలయం ఇంజినీరింగ్ అధికారుల అనుమతులు లేకుండా అమ్మవారి ఆలయం లోపల, బయట ఎటువంటి నిర్మాణాలు చేయవద్దని దేవాదాయ ధర్మాదాయ శాఖ స్థపతి పి. పరమేశ్వరప ఆలయ అధికారులకు సూచించారు. అమ్మవారి ఆలయం వద్ద జరుగుతున్న వివిధ అభివద్ధి నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా అమ్మవారి ఆలయం లోపల శ్రీ అంకమ్మ అమ్మవారి ఆలయ ప్రదక్షిణలు, భక్తుల దర్శనార్థం వివిధ అంశాలపై పునర్నిర్మాణం ప్రణాలికలు పరిశీలన చేశారు. అలాగే నూతనంగా నిర్మాణం జరుగుతున్న కేశఖండన శాల, టాయిలెట్స్, స్వాగత తోరణాలు పలు అభివద్ధి కార్యక్రమాలను పరిశీలించి ఆలయ ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు సలహాలు అందించారు. ఈకార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రమేష్ నాయుడు,ఈఈ వైకుంఠరావు ఎఈ రాజు, చైర్మన్ చెన్న కేశవ రావు ధర్మకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న నత్య దర్శకుడు శేఖర్ మాష్టారు

స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని ప్రముఖ సినీ నత్య దర్శకుడు శేఖర్ మాష్టారు కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం ఆలయ అధికారులు ఆయనను సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ప్రతి ఏడాది కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీ అని అమ్మను దర్శించుకోవడం ఆనందంగా వుందన్నారు. ఆయనతో సెల్ఫీలు దిగేందుకు భక్తులు, అభిమానులు ఎంతో ఆసక్తి చూపారు.

సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : జగ్గయ్యపేట: మండలంలోని చిల్లకల్లు-2 తిరుమలగిరి, ముక్తేశ్వరపురం, షేర్ మహమ్మద్ పేట గ్రామ సచివాలయాలను రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్, గ్రామీణాభివద్ధి సలహాదారు పి నాగార్జున రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల్లో సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయములలో ఏర్పాటు అవుతున్న ఆర్. బి. కె. సెంటర్ లు, వెల్నెస్ సెంటర్స్ నూతన గ్రామ సచివాలయ బిల్డింగ్ లు పనితీరులను పరిశీలించారు. అనంతరం చిల్లకల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయము లో ఏర్పాటు చేసిన సచివాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, వాలెంటిర్ల మీటింగ్ నందు పాల్గొని ప్రభుత్వం ద్వారా అమలు అవుతున్న అన్ని రకముల పథకములు గురించి సమీక్షా సమావేశము నిర్వహించారు. ఈ కార్యక్రమములో ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాసన సభ్యులు సామినేని ఉదయభాను, జిల్లా ప్రజా పరిషత్ ముఖ్యకార్య నిర్వహణాధికారి వి జ్యోతి బసు, జిల్లా కో ఆర్డినేటర్ అనురాధ, మండల ప్రజా పరిషత్ ప్రత్యేకాధికారి బాలాజీ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న
ఎంఎల్ఎ సామినేని ఉదయభాను

నాడు-నేడు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-గంపలగూడెం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సాయంత్రం నాడు - నేడు పనులను ఇంజనీరింగ్ అసిస్టెంట్ ముత్యాల గోపాలకష్ణ పరిశీలిం చారు. పాఠశాల ప్రాంగణంలో 39 లక్షలతో నాడు - నేడు రెండవ దశ పనుల్లో భాగంగా మూడు తరగతి గదుల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. వీటిని నాణ్యమైన రీతిలో పనులు కొనసాగిం చాలంటూ, గోపాలకష్ణ కూలీలకు సూచించారు.

వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : జిల్లా గ్రంధాలయ సంస్థ ఆధ్వర్యంలో జగ్గయ్యపేట గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయం నందు 26వ రోజు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12. గంటల వరకు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహించారు. ముందుగా విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. తదుపరి 9,10 తరగతి విద్యార్థులకు రసాయన శాస్త్రం లోని రసాయన మూలకాల గురించి ఎం ఎస్ సి విద్యార్థి జి.గీత వివరించారు. తర్వాత ఆంగ్లంలో ఉపాధ్యాయులు వినోద్ కుమార్ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పించారు బీడీసీ మల్లిక విద్యార్థులకు కోలాటం నేర్పించారు. ఈకార్యక్రమంలో గ్రంథ పాలకురాలు శ్రీమతి ఆలేటి ప్రభ, గ్రంథాలయ సిబ్బంది రమేష్, సత్యవతి పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలు పంపిణీ చేస్తున్న
కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి

ఇళ్ళ పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - భవానీపురం : అమరావతి, నిడమర్రు లేఔట్‌లలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గం భవానీపురం 40వ డివిజన్‌లోని 121, 122, 123, 124 సచివాలయాల పరిధిలో పేదలందరికీ వైఎస్ఆర్ ఇళ్ళ పథకం కింద లబ్ధిపొందిన 1356 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్, విఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు ఇళ్ళ పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఓలే, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్ మేనేజర్‌కు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - భవానీపురం : విజయవాడ విద్యాధర పురంలోని ఆర్టీసీ వర్కుషాపు వర్క్స్ మేనేజర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహించిన వి. వాణిశ్రీ, కృష్ణా జిల్లా డిపిటిఓగా బదిలీ అయిన సందర్భంగా శుక్రవారం జోనల్ వర్క్‌షాప్‌లో ఆమెకు వీడ్కోలు సభ నిర్వహంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్టీసీ జోనల్ ఇ.డి. గిడుగు వెంకటేశ్వ రరావు పాల్గొని ఆమెకు అభినందనలు తెలిపారు. అనంతరం జోనల్ వర్క్స్ సాపు ఉద్యోగులు, కార్మికులు వాణిశ్రీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గిడుగు వెంకటేశ్వరరావు మాట్లా డుతూ వాణిశ్రీ కృష్ణా జిల్లా డిపిటిఓగా బదిలీపై వెళ్ళి మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ విద్యాధరపురం ఆర్టీసీ జోనల్ వర్క్‌షాప్‌లో వర్క్స్ మేనేజర్‌గా పనిచేయటానికి తనకు సహకరించిన ఉద్యోగ, కార్మికులకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైసిఏఓ రామచంద్రరావు, సిఓఎస్ ఉషారాణి, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తా

- తిరువూరు డిఆర్ఒ ప్రసన్నలక్ష్మి

ప్రజాశక్తి - తిరువూరు : ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాను విచారణకు వచ్చానని తిరువూరు రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ ప్రసన్నలక్ష్మి వెల్లడించారు. తిరువూరులోని ఎన్ఎస్పీ కాలనీలోని నాల్గో తరగతి ప్రభుత్వ ఉద్యోగులు, ఇరిగేషన్ ఎంప్లాయిస్, పోలీసు హౌసింగ్ సొసైటీలకు కేటాయించిన స్థలాలను కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమె శుక్రవారం పరిశీలించారు. ముందుగా సొసైటీల స్థలాలను పరిశీలించిన ఆర్‌డిఒ స్థానిక తన కార్యాలయంలో మూడు సొసైటీల అధ్యక్షులతో మాట్లాడారు. పోలీస్, ఇరిగేషన్ సొసైటీల అధ్యక్షులు కొద్దిసేపు ఉండి వెళ్లారు. నాల్గో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు ఎండి.రఫీ సమస్యలను ఆర్‌డిఒకు వివరించారు. ఇరిగేషన్ సొసైటీ స్థలానికి సంబంధించి 33 మంది సభ్యులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, తాము వాళ్ల స్థలాలు అక్రమించామని చెప్పేదానిలో వాస్తవం లేదని రఫీ తెలిపారు. పోలీసు సొసైటీ వాళ్ళు కూడా వారికి కేటాయించిన స్థలంలో కాకుండా అదనంగా ఎన్ఎస్పీ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకుని హోటల్ నిర్మించి రోజుకు రూ.2000 వసూలు చేస్తున్నారని వివరించారు. పై రెండు సొసైటీల అవకతవకలపై విచారణ జరపకుండా తమ సొసైటీలో అక్రమాలు జరిగాయని బయట వ్యక్తులు ఫిర్యాదు చేస్తే జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు విచారణ జరుపుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సొసైటీ చట్టప్రకారం తాము వెళ్తున్నామనీ, విచారణల పేరుతో రెవెన్యూ అధికారులు తమను గత ఎనిమిదేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. అక్కసుతో కావాలనే తమపై తప్పుడు రిపోర్టులు ఇవ్వటంతో మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆర్థికంగా కూడా ఎంతో నష్టపోయామన్నారు. సొసైటీ బైలా ప్రకారమే తాము సొసైటీని నిర్వహిస్తున్నామన్నారు. సొసైటీలో ఉన్న వారంతో నాల్గో తరగతి ఉద్యోగులుగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందినవారేనన్నారు. ఆర్‌డిఒ సానుకూలంగా స్పందించి నాల్గో తరగతి ఉద్యోగుల సొసైటీకి ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరారు. దీనికి ఆర్‌డిఒ ప్రసన్నలక్ష్మి స్పందిస్తూ నాల్గో తరగతి ఉద్యోగుల సొసైటీ ప్రతినిధులు చెప్పిన అంశాలపై పరిశీలిస్తామన్నారు. నాల్గో తరగతి ఉద్యోగులకు అన్యాయం జరగకుండా తమవంతు సహకారాన్ని అందజేస్తామన్నారు. తమ దృష్టికి అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈకార్యక్రమంలో తిరువూరు తహశీల్దార్ సురేష్ బాబు, డివిజన్ సర్వేయర్ సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.



డిఆర్ఒ ప్రసన్నలక్ష్మితో మాట్లాడుతున్న ఎండి రఫీ

రైతుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత

హనుమంతపురంలో పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్

ప్రజాశక్తి-పమిడిముక్కల

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం వ్యవసాయ రంగం బలోపేతానికి, రైతుల సంక్షేమానికి నిరంతరం అనేక పథకాలు అమలు చేస్తూ ముందుకు సాగుతోందని పామర్రు శాసనసభ్యులు కైలే అనిల్‌కుమార్ అన్నారు. పమిడిముక్కల మండలం హనుమంతపురంలో శుక్రవారం జరిగిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఆయా కుటుంబ సభ్యులను



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పలకరించి సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడారు. సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. రైతులకు వ్యవసాయానికి అవసరమైన ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను తక్కువ అద్దెకే సన్న, చిన్న కారు రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. తద్వారా రైతులకు సాగు వ్యయం తగ్గించి నికర ఆదాయం పెంచాలన్న సీఎం వైఎస్ జగన్ ఆలోచనలకు వైఎస్సార్ యంత్ర సేవా పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ పథకం కింద రూ.15లక్షల విలువైన యంత్ర పరికరాలను ఆర్బీకే స్థాయిలోనూ, రూ.25 లక్షల విలువైన కంబైన్డ్ హార్వెస్టర్‌తో కూడిన యంత్ర పరికరాలను క్లస్టర్ స్థాయిలోనూ ఏర్పాటుచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పమిడిముక్కల తహశీల్దార్ బి.రాజ్యలక్ష్మి, ఎంపిడిఒ సుధా ప్రవీణ్, పంచాయతీరాజ్ ఎఇ శరాబందిరాజు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంబపు రాంబాబు, హనుమంతపురం సర్పంచ్ కలపాల రాంబాబు, పమిడిముక్కల మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, పమిడిముక్కల, హనుమంతపురం, అగినపర్రు కోపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు మైనేని కోటేశ్వరరావు, మోరంపూడి గంగరాజు, అక్కినేని సతీష్, వైసిపి నాయకుడు యేనుగు మస్తాన్‌రావు, పాతూరి చంద్రపాల్, శొంఠి వెంకటేశ్వరరావు, మారపాక మహేశ్వరరావు, కొడాలి రాంబాబు, మన్నే కిశోర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్

మచిలీపట్నం మండలం కానూరు గ్రామంలో శుక్రవారం కృష్ణాజిల్లా తెలుగు రైతు అధ్యక్షులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు, మహిళలు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఊహించని రీతిలో ప్రకటించిన ఆరు పథకాలు అమోఘమనీ,



ఇవన్నీ రాబోయే ఎన్నికల్లో టిడిపి పార్టీని తిరుగులేకుండా అధికారంలోకి తీసుకొస్తాయన్నారు. ఈ సందర్భంగా గోపు సత్యనారాయణ మాట్లాడుతూ మహానాడు వేదికగా జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పేదలను ధనవంతులుగా చేస్తానని తొలిరోజు వెల్లడించారన్నారు. ఈ కార్యక్రమంలో ఈవన రామాంజనేయులు, పీత రాము, బోలిశెట్టి నాని, మోపిదేవి కృష్ణ, ఈవన సత్యనారాయణ, వీర హరిబాబు, అల్లం పెద్దిరాజులు, లంకే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ఘన సత్కారం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

స్థానిక బలరాముని పేటలోని ఆదివెలమ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఇంటర్మీడియేట్ పరీక్షలలో మార్కులు 1000/989, 985, 965, 950, 10 వ తరగతి పరీక్షలలో 600/560, 550 మార్కులు సాధించి ప్రతిభ చూపిన విద్యార్థినీ, విద్యార్థులను సంఘం సభ్యులు సత్కరించారు. ప్రతిభను గుర్తించి మెమెంటోలు, టిఫిన్ క్యారేజీలు, స్కూల్ బ్యాగ్లు అందించారు. విద్యారుల చదువులు నిమిత్తం ఆర్థిక ఇబ్బందులు పడకుండా అదివెలమ కుటుంబ సభ్యులు చారిటబుల్ ట్రస్టు నుండి చేయుతను అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిల్లారీ శెట్టి శ్రీనివాసరావు, మాదిరెడ్డి ఆంజనేయులు, హరినాథ్, బాబ్జీ, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సత్కారం పొందిన విద్యార్థులు వీరే..

నీతికథల బోధన

చల్లపల్లి : స్థానికశాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగింది. హాజరైన వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పుస్తక పఠనం చేశారు. విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంచేందుకు నీతి కథలు బోధించారు. చదువుతోపాటు ఆరోగ్యకరమైన ఆటలను ఆడించారు. అనంతరం చిత్రలేఖనం నేర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పాఠకులు పాల్గొని కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. గ్రంథాలయ అధికారి కందుల గణేష్ కుమార్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పటిష్టమైన ప్రణాళిక...ఆల్‌రౌండ్ అభివృద్ధే ధ్యేయం

- సజనాత్మక విద్యకు చిరునామా 'వీకేఆర్ కాలేజీ'

విద్యారంగంలో గన్నవరంలోకి వికెఆర్ కళాశాల సరికొత్త ఒరవడితో ముందుకు సాగుతోంది. ఇంటర్మీడియట్, డిగ్రీ కోర్సులను విద్యార్థులకు అందిస్తూ వారికి సృజనాత్మక విద్యాబోధన అందించటం ద్వారా అత్యుత్తమ ఫలితాలు సాధనకు యాజమాన్యం పటిష్టమైన ప్రణాళికతో కృషిచేస్తోంది. చదువులో వెనుకబడిన విద్యార్థులను సైతం గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు బోధించటం ద్వారా వారు కూడా పురోగతి సాధించేందుకు కళాశాల అధ్యాపకులు, యాజమాన్యం కృషిస్తోంది. దశాబ్దాల కాలంగా ఈ కళాశాలలో అనేకమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దటానికి దోహదపడింది. ఈ కళాశాలలో చదివిన ఎందరో నేడు దేశ, విదేశాల్లో విద్య, ఉద్యోగం, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో ఉన్నతులుగా స్థిరపడిన వారు ఉన్నారు. పలు రంగాల్లో, గౌరవప్రదమైన వృత్తుల్లో రాణిస్తున్న వారు మరికొందరు ఉన్నారు.

ప్రజాశక్తి-గన్నవరం

విద్యార్థుల్లో నిబిడీకతమైన సృజనాత్మకత శక్తిని వెలికితీయటం ద్వారా వారిలో ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ సాధించేలా నిరంతరం కృషిచేస్తున్న విద్యాసంస్థల్లో గన్నవరం 'వేములపల్లి కోదండ రామయ్య కళాశాల (వీకేఆర్ కళాశాల) ఒకటని చెప్పొచ్చు. విజ్ఞానం అందించే పాఠాలూ.. అనుభవాలు...మొక్కల పెంపకాలు.డిజిటల్ క్లాసులూ, ల్యాబులూ. కంప్యూటర్ విద్యను బోధిస్తుండటం ఇక్కడ ప్రత్యేకత. విద్యార్థుల్లో వ్యక్తిగత స్కిల్స్‌ను పెంపొందిస్తూ సమాజానికి మంచి పౌరులను అందించే కార్యశాలగా గన్నవరం వీకేఆర్ గుర్తింపు పొందింది. మారుతున్న సమాజంలో అధునాతన డిజిటల్ టెక్నాలజీని సైతం అందిపుచ్చుకునేలా ఇక్కడి విద్యార్థులకు బోధన జరుగుతోందని అధ్యాపకులు, విద్యార్థులు పేర్కొంటున్నారు.

గన్నవరం ఎయిర్‌పోర్టుకు ఎదురుగా, జాతీయ రహదారి పక్కన కళాశాల ప్రాంగణం మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో రూపుదిద్దుకోబడింది. ఈ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌళిక వసతులు అందుబాటులో ఉన్నాయి. 1969 ప్రారంభించబడి నాటి నుండి నేటి వరకు పాఠ్య, పాఠ్యేతరాంశాలతో పాటు సృజనాత్మక, పరిశీలనాత్మక, క్రీడా పద్ధతుల్లో బోధన జరుగుతోంది. 1500 పైగా విద్యార్థులుండే ఈ కళాశాలలో రాష్ట్రప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి బోధన జరుగుతోంది. ఏటేటా ఈ కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ, బిబిఎ వంటి కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులు రికార్డు ఫలితాలు సాధిస్తున్నారు. ఇంటర్మీడియట్‌తో పాటు డిగ్రీలో నాణ్యమైన ఉన్నత విద్యా బోధనతో పాటు క్రీడా, సాహిత్య, సామాజిక విషయాలను. విద్యార్థులకు అందిస్తోంది. అధ్యాపకులు అదనపు సమయాన్ని కేటాయిస్తూ విద్యార్థులను పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. పోటీ పరీక్షల వల్ల కలిగే విజ్ఞానం. ప్రయోజనాలే కాకుండా ప్రస్తుతం సామాజిక బాధ్యత, మహిళా విద్య, మార్కెటింగ్ స్కిల్స్ వంటి సామాజిక అంశాలపై చక్కటి అవగాహన కల్పిస్తున్నారు. కళాశాల ఫౌండర్ వేములపల్లి కోదండరామయ్య ఆశయాలకు అనుగుణంగా ప్రస్తుత కళాశాల యాజమాన్య కమిటీ



అధ్యక్షులు వెంకట్ మోటపర్తి, కార్యదర్శి జి ఎల్ ఎస్ ఎన్ ప్రసాద్, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు సారధ్యంలో పూరిపాకలో స్థాపించబడి 'ఇంతింతై వటుడింతై' అన్న చందంగా నేడు గన్నవరం విమానాశ్రయం ఎదురుగా అత్యాధునిక పక్కా భవనాలతో 3.5 ఎకరాల్లో పచ్చని ప్రకృతి రమణీయకతను అందిపుచ్చు కుంది. అన్ని రకాల ఆధునిక హంగులను కళాశాల యాజమాన్యం సమకూర్చుతోంది. విద్యార్థులకు ఎలాంటి పోటీ ప్రపంచంలోనైనా మేము ఎందులోను వెనకడుగు వేయబోమనే విధంగా శిక్షణ ఇస్తూ వారు ఆయా పరీక్షల్లో ఉన్నతంగా రాణించేలా కృషిచేస్తోంది యాజమాన్యం. దృశ్య, శ్రవణ మాధ్యమాలు తరగతి గదిలోకి తీసుకొచ్చి ప్రతి విద్యార్థి ఆన్లైన్ పోటీ పరీక్షలు ఎదుర్కొనే విధంగా తర్ఫీదునిస్తోంది. ఆంగ్లభాషాభివృద్ధితో పాటు భావాత్మక నైపుణ్యాలను మరింత పటిష్ట పర్చేలా కృషిచేస్తోంది. సాహిత్య, సాంస్కృతిక, సామాజికాంశాలతో పాటు సేవా దృక్పథాన్ని విద్యార్థుల్లో పెంపొందించేందుకు నిరంతరం కృషిచేస్తోంది.

చదువు



కొమ్మినేని శ్రీనివాసరావుకు సత్కారం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న మోటివేటర్



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్

అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నాం

వికెఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు



ఏటేటా తమ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. ఇంటర్‌లో కళాశాల విద్యార్థులు విశేషమైన ప్రతిభ కనబర్చి సూటికి 80శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్మీడియట్లో సెకండ్ ఇయర్ ఎంపీసీలో రిహాన్ 976/1000 మార్కులతో కళాశాలలో మొదటి స్థానంలో, జి.యుక్త 958/1000 మార్కులతో ద్వితీయ స్థానం, బైపీసీలో కె.దీపు 959/1000 మార్కులు, ఎ.రూప 911/1000 మార్కులు సాధించారు. 800 నుండి 750 మార్కులు సాధించిన విద్యార్థులు 49 మంది, 600 మార్కులు తొమ్మిదిమందికి వచ్చాయి. సిఇసి గ్రూపులో 230 మంది ఉత్తమ ఫలితాలు సాధించారు. తక్కువ ఫీజులతో విలువలతో కూడిన విద్యను అందించడమే ఏకైక లక్ష్యంగా అధ్యాపకులు పనిచేయడం విశేషం. అందుకు యాజమాన్యం అంకితభావంతో పూర్తి సహకారం అందిస్తోంది. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో విద్యా వెలుగులను నింపడానికి కషి చేస్తున్న ఏకైక కళాశాల వీకేఆర్ కళాశాల. విద్యార్థుల తల్లిదండ్రులు ఒక్కసారి కళాశాలను సందర్శించి తమ పిల్లలను చేర్పించాలని కోరుతున్నాం. పేద విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించేది ఈ కళాశాలలోనే అని చెప్పడానికి ఎంతో సంతోషిస్తున్నాం. కళాశాల యాజమాన్యం విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను పూర్తిస్థాయిలో సమకూరుస్తోంది. ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందిస్తోంది. ప్రత్యేక స్కాలర్‌షిప్‌లు ఇవ్వటం ద్వారా, ఆర్థిక సహాయం చేయటం ద్వారా ఉన్నత చదువులకు సహకరిస్తోంది.

మొదటిపేజీ తరువాయి

ఆత్మహత్యగా చిత్రీకరిస్తే ఉపేక్షించబోం

డెడ్ బాడీ మీద పెట్రోల్ పోసినట్టుగా ఉందిని తనకు తాను పోసుకున్నట్టుగా లేదని చెప్పారు. ఇటువంటి అనుమానాలు చాలా ఉన్నాయని, ఏమీ తేల్చకుండా ఆత్మహత్య ఇక్కడ ఉన్నత వర్గాలకు, ఆర్థికంగా పలుకుబడి ఉన్నవారికి పోలీస్ అధికారులు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. దీని మీద ఖచ్చితంగా డీజీపీ, హోం మంత్రికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో దాని ఫలితం అనుభవిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త మంద వెంకటేశ్వరరావు, మాదిగ కో సమన్వయకర్త పేటేటి ప్రభాకర్, జిల్లా కన్వీనర్ కొల్లూరు బసవ, ఎన్టీఆర్ జిల్లా కన్వీనర్ కోట డానియల్, జిల్లా ఎంఎస్పి కో కన్వీనర్ సిద్ధల జయరాజు, నవీన్, కొల్లూరు దినేష్, మట్ట నాని పాల్గొన్నారు.

5 నుంచి పాదయాత్రలు

జీపు యాత్రలు ప్రారంభమవుతాయని తెలిపారు. 10న కృష్ణాజిల్లా తోట్లవల్లూరులో పాదయాత్ర ప్రారంభమవుతుందన్నారు. అనంతరం అక్కడ సభ జరుగుతుందన్నారు. 11న వల్లూరుపాలెం నుండి పాదయాత్ర కొనసాగుతుందని వివరించారు. 12న విజయవాడలో పెద్ద ఎత్తున జరిగే రాయబారం కార్యక్రమంలో కౌలు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి కౌలు రైతుల సంఘం నాయకులు టీవీ లక్ష్మణస్వామి, బేతా శ్రీనివాసరావు, సలీం, అజ్మీరా వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, సురగాని సాంబశివరావు, మాదిరెడ్డి చిన్న, మల్లంపల్లి ఆంజనేయులు, రామ్మోహనరావు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధుల లేఖలే ప్రామాణికం..!

తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

పంచాయతీ శాఖల్లో కొలిక్కి వచ్చేనా?

జిల్లా పంచాయతీ శాఖలో పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1, 2, 3, 4 కేటగిరీలకు సంబంధించి బదిలీలు జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. గ్రేడ్-1 కార్యదర్శుల్లో 9 మంది ఒకే ప్రాంతంలో ఐదేళ్లుగా పనిచేస్తున్న వారు ఉన్నారు. మరో 25 మంది రిక్వెస్టు బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. గ్రేడ్-2 కార్యదర్శుల్లో ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్నవారు నలుగురు ఉండగా, రిక్వెస్టు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారు మరో ఐదుగురు ఉన్నారు. వీరిలో ఎవరిని ఎక్కడకు బదిలీ చేయాలనే అంశంతోపాటు వారు తెచ్చుకున్న సిఫార్సు లేఖలను బట్టి జాబితాలు సిద్ధం చేశారు. డీపీవో, కార్యాలయం పరిధిలో జూనియర్ అసిస్టెంట్లకు సంబంధించి 10 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. తుది జాబితాలు తయారు చేసి కలెక్టర్ ఆమోదం తెలిపిన తరువాతే వీటిని అధికారికంగా బయటకు ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.అలాగే 4. 5 సంవత్సరాలుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తూ బదిలీ కోసం దరఖాస్తులు చేసుకున్నవారిలో కొందరిని పనిగట్టుకుని పక్కన పెట్టారని డీపీవో కార్యాలయ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఏదేమైనప్పటికీ రెవెన్యూ ఉద్యోగుల బదిలీల పక్రియ ఎట్టి పరిస్థితుల్లో శుక్రవారం రాత్రికి పూర్తి చేయాలని అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు.

సివిల్స్ ర్యాంకర్లకు ఘన సత్కారం

ఎక్కువ మంది జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ చాటారని తెలిపారు. దేశంలో అత్యున్నతమైన సర్వీసు సివిల్స్ సర్వీసు అని ఇందులో ర్యాంకు సాధించడం చాలా కష్టంతో కూడుకున్నదని అన్నారు. ఇటువంటి సర్వీసులో అడుగుపెడుతున్న యువతకు పలు సూచనలు అందించారు. అలాగే సివిల్స్ చదవాలనుకునే వారు చక్కటి ప్రణాళికతో చదివితే మంచి మార్కులు సాధించి విజయం సాధించగలరని అన్నారు. నేడు సివిల్స్ సాధించాలనుకునే వారికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని నిరుత్సాహం చెందకుండా పట్టుదలతో సాధించాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన పోలవరపు సాంస్కృతిక సమితి నిర్వాహకులు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ సివిల్స్‌లో విజయం సాధించడం అంటే చాలా కష్టంతో కూడుకున్నదన్నారు. వీరి విజయం వెనకాల ఎన్నో త్యాగాలు, కష్టాలు, ఇబ్బందులు ఉన్నాయని, వాటిని అధిగమించి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి ర్యాంకు సాధించడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ అధికారులుగా చక్కని పరిపాలనతో అభివృద్ధితో పాటు పేద ప్రజలకు సేవలను అందించాలని కోరారు. తొలుత వేదికపైకి అతిథులను రామరాజు ఆహ్వానించగా, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మల్యాద్రి, పలువురు ప్రముఖులు, నగర వాసులు పాల్గొన్నారు.



యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు కార్డులివ్వాలి

ప్రజాశక్తి-చందర్లపాడు

మండలంలోని కొడవటికల్లు గ్రామంలో శుక్రవారం కౌలు రైతుల సంఘం పాదయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ ఈ నెల 12న మంగళగిరి సిసిఎల్ఎ కార్యాలయానికి రాయభార పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో 5 నుండి 10వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార జాతాలు, సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల వద్ద వినతిపత్రాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పంట రుణాలు, రాయితీ ఎరువులు విత్తనాలు, పంట నష్టపోతే పరిహారం దక్కక కౌలు రైతులకు అడుగడుగునా నష్టం జరుగుతుందన్నారు. గ్రామ సభలు నిర్వహించి అసలైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు, భీమా, ఈ క్రాప్, రాయితీపై రుణాలు, పంట అమ్ముకునేందుకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం మండల అధ్యక్షుడు జి ఏడుకొండలు, రాయిడి వెంకటేశ్వరరావు, జంపాని అశోక్, వేగినేటి చందు, మాదాల నరసింహారావు, షేక్ నాగులు, కందుల శ్రీనివాసరావు, వేగినేటి సాంబశివరావు, నలజాల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



డిజిటల్ పోర్ట్ యాక్టివేషన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: రింగ్ రోడ్డు వద్ద గల సాయి స్వర్ణ హ్యుందాయ్ షోరూం నందు శుక్రవారం డిజిటల్ పోర్ట్ యాక్టివేషన్ ను ప్రారంభించినట్లు సంస్థ జనరల్ మేనేజర్ భగత్ సింగ్ తెలిపారు. సెమీ అర్బన్ ,రూరల్ ప్రాంతాలలో తమ కార్లపై అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. హ్యుందాయ్ గ్రాండ్ ఐ 10 నియోస్ కార్ ను వినియోగ దారులకు నేరుగా ఇంటి వద్దకే డెలివరీ చేయడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. షోరూం జనరల్ మేనేజర్ భగత్ సింగ్ మాట్లాడుతూ తమ షోరూం పరిధిలో గుడివాడ, నుజివీడు ప్రాంతాలలో డిజిటల్ పోర్ట్ యాక్టివేషన్ రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దుర్గమ్మ దర్శనానికి తరలివచ్చిన యాత్రికులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: శుక్రవారం సందర్భంగా దుర్గమ్మ దేవస్థానానికి యాత్రికులు తరలివచ్చారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చైర్మన్ కర్నాటి రాంబాబు, ఇఓ భ్రమరాంబ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇంద్రకీలాద్రిపై ధర్మపథంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహామండపం ఆరవ అంతస్తులో గల వేదికపై విజయవాడ, విద్యాధరపురంకు చెందిన శ్రీ వాగ్దేవి కూచిపూడి నృత్యాలయ బృందం పలు భక్తి గీతాలకు చేసిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. స్వాగతం, కొండలలో నెలకొన్న, కలియుగాన, శాంతాకారం, శ్రీకర శుభకర, శ్రీమన్నారాయణ, నరసింహ దగ దగ, జతిస్వరం, అదిగో అల్లదిగో వంటి భక్తి గీతాలకు వి. సాయి భవ్యశ్రీ, ఆర్. గీతికా మాధురి, వర్షిత, హర్షిత, హన్విత, రుత్విక, జ్యోతి, బాలా బ్రామ్మిణి, మోక్ష, నిఖిల్, సహస్ర, గ్రీష్మ, జ్యోతి భక్తిగీతాలకు చేసిన నృత్య ప్రదర్శనలు అలరించాయి.



వడగాల్పులకు ప్రజలు బెంబేలు

ప్రజాశక్తి-కంచికచర్ల

రోహిణి కార్తె కావటంతో నాలుగు రోజులుగా ఎన్టీఆర్ జిల్లాలో భానుడి ఎండ తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండ తీవ్రతకు తోడు వడగాల్పులు వీస్తున్నాయి. శుక్రవారం ఎండ తీవ్రత నిప్పుల కొలిమి వలె ఉంది. ఉదయం 7 గంటల నుండి ఎండ తీవ్రత తోపాటు వెచ్చటి వేడి గాలి వీస్తోంది. ప్రతి గంటకు వడ పెరుగుతుంది. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు వేడితో పాటు తీవ్ర ఉక్కపోతకు జనం అల్లాడిపోతున్నారు. ఎండ తీవ్రతకు కొద్ది సేపు బయటకు వచ్చిన జనం వడదెబ్బ గురౌతున్నారు. ఎండ తీవ్రత, వడగాలులు వల్ల జ్వరం, తలనొప్పి, వాంతులు తదితర రోగాల బారిన పడుతున్నారు. వడదెబ్బ సోకిన వారికి ఆసుపత్రి లో సిలైన్ బాటిల్స్ ఎక్కిస్తున్నారు. దీంతో జనం బయటకు రావటానికి అల్లాడిపోయారు. శుక్రవారం . మధ్యాహ్నం సమయంలో కంచికచర్ల, నందిగామ, మైలవరం, విజయవాడ, జగ్గయ్యపేట తదితర పట్టణాల్లో జనం బయటకు రాకపోవటంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. ఉక్కపోతకు జనం ఇళ్ళల్లో కూడా ఉండలేకపోతున్నారు. పిల్లలు, వద్ధులు ఇళ్ళల్లో ఉండలేక అల్లాడి పోతున్నారు. ఫ్యాన్ వేసినా వెచ్చటి వడ వస్తోంది. ఎండ తీవ్రతకు మంచినీరు, శీతలపానీయాలు కొబ్బరి నీళ్ల తాటిముంజలకు వాడకం పెరిగింది, దీంతో వాటికి గిరాకీ పెరిగింది. ఎండ వేడికి తారు రోడ్లు కరిగిపోతున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటిన వేడి తగ్గటం లేదు. రాత్రి సమయంలో సైతం వేడి గాలులు వీస్తున్నాయి. దీనికి తోడు కొద్దిరోజులుగా ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తరచూ కరెంట్ కోత విధిస్తున్నారు. దీంతో ఫ్యాన్ తిరగక, గాలి ఆడక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, విజయవాడ
ఓయస్.నెం.368/2018

బిట్వీన్:
పంచకర్ల వీరమ్మ .... వాది

మరియు

1. కేశన నాగమల్లేశ్వరి మరియు ఇతరులు
2. కేశన సంతోష్‌కుమార్ (డి-2), తండ్రి. లేటు వెంకట లక్ష్మయ్య, హిందువు, వయస్సు 22 సం.లు,
3. కేశన రవితేజ, (డి-3), తండ్రి. లేటు వెంకట లక్ష్మయ్య, హిందువు, వయస్సు 19 సం.లు, (డి-2 మరియు డి-3 నివాసము : గోసాల బందరు కాలువ కట్ట, కంకిపాడు, కంకిపాడు మండలము, కృష్ణా జిల్లా. .... ప్రతివాదులు

పై నెంబరు దావాలోని ప్రతివాదులైన, 2,3 వారలు పై కోర్టు వారి ఎదుట హాజరు నిమిత్తము ది.16.6.2023 నకు వాయిదా అయివున్నది. కావున పై వారలు ది.16.6.2023న ఉదయం 10.30 ని.లకు స్వయము గా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలున్న తెలుపు కొనవలయును. లేని యెడల పై దావాను పై వారలకు పరోక్షమున తీర్మానింపబడునని యిందు మూలముగా తెలియ చేయడమైనది.

/// శ్రీ కోర్టువారి ఉత్తర్వులననుసరించి///

సుంకర నాగ శ్రీనివాసరావు
వాది తరపు న్యాయవాది, విజయవాడ

IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT HYDERABAD
O.S.NO 2391 OF 2019

Between:
Andhra Bank Credit Card Division, Head Office Koti, Hyderabad, represented by the Senior Manager (Law)
….Plaintiff

AND

Smt. Kranti Dudekul, W/o. Sri D. Ismail, aged about 28 years, Occ: Business, R/o.H.No.21-9/6-1A, near Railway Station Madhuranagar, 7th Street, Park Line, Pasuputhota, Vijayawada-5200011 A.P.
…Defendant

The plaintiff filed the above numbered suit against you, for recovery of Rs.2,01,268 .68ps (Rupees Two lakhs one thousand two hundred and sixty eight and Paise sixty eight only) together with subsequent interest @2.95% per month compounded monthly and service charges from date of suit till realization and costs and I.A No.283/2021 is filed for amendment of cause title as "Union of Bank of India" in the place of Andhra Bank" at the appropriate places in the cause title and pleadings. Take notice that the suit and I.A stand posted to 30-06-2023 for your appearance in person or through duly appointed Advocate at 10-30A.M and if you fail to so appear, the amendment petition and the suit will be decided on merits, in your absence.

(BY ORDER OF THE COURT)
Sd/- (S.VIKRAMADITYA BABU)
Counsel for the Plaintiff
H.No.16-11-16/T/5,
West Prasanthnagar Colony,
Moosarambagh, Hyderabad-500 036

IN THE COURT OF THE HON'BLE V ADDITIONAL SENIOR CIVIL JUDGE, VIJAYAWADA
I.A.NO.24/2022 IN O.S.NO.326/1999

Between:
Nalluri Krishnaveni and another
...Petitioners/Palintiffs
And
Nalluri Sreenivasa Babu (died) and others
...Respondents/Defendants

To
The respondents
3,4,8,10,13,17,18,20,21,22

R3 Nalluri Prasanthi, D/o late Srinivasa Babu, Properties, R/o D.No.59A-17/1-9A, N.S.R.Nagar, Patamata, Vijayawada.
R4 Nalluri Hemanth Babu, S/o late Srinivasa Babu, Properties, R/o D.No.59A-17/1-9A, N.S.R.Nagar, Patamata, Vijayawada.
R8 Chaparla Anandi, D/o K.Sivarama Krishna, R/o Flat No.102, D.No:57-10-14A, Venkat Residency, New Postal Colony, East Road, Patamata, Vijayawada-8.
R10 Adusumilli Mohana Vamsi, S/o Venkata Ranga Rao, R/o Flat No.104, D.No:57-10-14A,Venkat Residency, New Postal Colony, East Road, Patamata, Vijayawada-8.
R13 Jagabattula Venkata Kanaka Sujatha, W/o Nageswara Rao, R/o Flat No.204, D.No:57-10-14A,Venkat Residency, New Postal Colony, East Road, Patamata, Vijayawada-8.
R17 Peddiraju Venkata Appa Rao, S/o Venkata Rama Rao, R/o Flat No.404, D.No:57-10-14A,Venkat Residency, New Postal Colony, East Road, Patamata, Vijayawada-8.
R18 Panchakarla Murali Krishna, S/o Venkata Rama Rao, R/o Flat No.502, D.No:57-10-14A,Venkat Residency, New Postal Colony, East Road, Patamata, Vijayawada-8.
R20 Anne Subrahmanya Balaji, S/o Padmanadam @ Padmanabham, R/o Flat No.503, D.No:57-10-14A, Venkat Residency, New Postal Colony, East Road, Patamata, Vijayawada-8.
R21 Darsi Srinath, S/o Veera Narayana, R/o Flat No.504, D.No:57-10-14A, Venkat Residency, New Postal Colony, East Road, Patamata, Vijayawada-8.
R22 Juvvaji Rajyalakshmi, W/o Papaiah, R/o Opp.Aruna Apartments, Patamata, Vijayawada.

పై నెంబరు దావాలో పై చెప్పిన పిటిషన్ లోని రెస్పాండెంట్స్ 3, 4, 8, 10, 13, 17, 18, 20, 21, 22లకు శ్రీ కోర్టువారు సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా నోటీసులు జారీచేసి యున్నారు. కావున సదరు రెస్పాండెంట్స్ 3, 4, 8, 10, 13, 17, 18, 20, 21, 22లు ది.07-07-2023వ తేది ఉదయం గం.10-30 ని.లకు పై చెప్పిన కోర్టులో స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనచో పరోక్షమున తీర్మానించబడునని శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో తెలియపరచడమైనది.

By order of the court

Vijayawada,
Date:25-5-2023.

Sri.M.Samba Siva Rao,
Smt.M.V.L.Gopi Ratnam,
Sri.M.Koti Nagaiah,
Advocates,
D.No:27-30-7, Akulavari Street,
Governorpet, Vijayawada-2,
Cell:9948092920

భూ యజమాని సంతకం నిబంధనను తొలగించాలి

- ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

భూ యజమాని సంతకం ఉంటేనే కౌలు రైతులకు కౌలు కార్డులు జారీ చేస్తామనే నిబంధనను తక్షణమే రద్దు చేయాలని ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతుందని ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శిలు వి.సాంబిరెడ్డి, ఎం.వి.ఆంజనేయులు తెలిపారు. నగరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కౌలు రౌతుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఆంధ్రప్రదేశ్‌లో కౌలు రైతులు జూన్ 5 నుండి చేపడుతున్న సామూహిక రాయబార యాత్రకు ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ మద్దతు తెలియచేస్తుందన్నారు. రాష్ట్ర రైతాంగంలో కౌలు దారుల సంఖ్య సుమారు 70 శాతం వరకు ఉందని, రాష్ట్ర ప్రభుత్వ జారీ చేసిన



మాట్లాడుతున్న ఎం.వి.ఆంజనేయులు

కౌలు కార్డు ఉంటేనే రైతు కౌలు రైతులగా గుర్తించబడతాడన్నారు. కౌలు కార్డు ఉంటేనే పంటల భీమా, నష్టపరిహారాలు పొందడం, పంటను అమ్ముకునే అవకాశం ఉంటుందన్నారు. కౌలు కార్డులు జారీ చేయటానికి భూ యజమాని సంతకం ఉండితీరాలన్న నిబంధన రాష్ట్ర ప్రభుత్వం విధించిందన్నారు. సంతకం చేస్తే తరువాత కాలంలో భూమిమీద కౌలుదారులకు హక్కు ఏర్పడుతుందేమోనని, తమ భూమి తమ చేతులలో నుండి పోతుందేమోనన్న భయంతో భూ యజమానులు సంతకం చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. ఫలితంగా కౌలుదారులకు పంటల భీమా, నష్టపరిహారాలు, రైతు భరోసా లాంటివి అందడం లేదన్నారు. ఈ క్రాపింకు అవకాశం లేకుండా పోతుందన్నారు. దీనితో పండించిన పంటను అమ్ముకోవాలంటే కౌలు రైతులు నానా యాతన పడుతున్నారని అసలే ఇన్‌పుట్స్ ధరలు పెరగడం, ఋణ పరపతి లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు, గిట్టుబాటు ధరలు లేకపోవడం తదితర సమస్యలతో సతమతమవుతున్నా కౌలు రైతులకు పంటల భీమా, నష్ట పరిహారాలు, రైతు భరోసా లాంటివి అందకపోవడం, పంటను అమ్ముకోవడానికి కూడా ఇబ్బందులు పడటంతో విధిలేని పరిస్థితుల్లో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కౌలు రైతులు యాత్ర చేపట్టారన్నారు.

దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతి

అవనిగడ్డ : చీరాల-పేరాల ఉద్యమ నిర్మాత దుగ్గిరాల గోపాలకృష్ణయ్య జయంతిని అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకట్రావు, గోపాలకృష్ణయ్య చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. చీరాల-పేరాల ఉద్యమ నిర్మాతగా స్వాతంత్ర పోరాట యోధుడిగా పేరు గడించడంతోపాటు ఆంధ్రరత్నగా బిరుదు పొందిన గోపాలకృష్ణయ్య పోరాట స్ఫూర్తిని ప్రస్తుతించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు శీలం అశ్విన్ కుమార్, బర్మా శ్రీనివాసరావు, పాండురంగారావు, షేక్ వహీదుల్లా, యాసం వెంకటేశ్వరరావు, కూరాకుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధ సంప్రదాయంలో ఏరువాక

ఘంటసాల : బౌద్ధ సాంప్రదాయ ప్రకారం ఏరువాక కార్యక్రమాన్ని శుక్రవారం ఘంటసాల మండల పరిధిలోని గోగినేని పాలెం గ్రామంలో బౌద్ధ భిక్షులు నిర్వహించారు. ది బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు ఆయుష్మాన్ వై.హరి బాబు ఆధ్వర్యంలో గ్రామంలోని కుంపటి శ్రీనివాసరావు వ్యవసాయ భూమిలో బౌద్ధ దమ్మ సాంప్రదాయ పద్ధతిలో దుక్కిదున్ని వ్యవసాయ పనులను ప్రారంభించారు. కేకే.బోధి, రాహుల్ బోధి, చక్రి బోధి, కుంపటి సుబ్బారావు, కుంపటి చక్రవర్తి పాల్గొన్నారు.

మందాకృష్ణ పరామర్శ

వత్సవాయి : వత్సవాయి మండలం చిట్యాల గ్రామానికి చెందిన కొదమల్ల శ్రీకాంత్ ఇటీవల చిన్న ఘర్షణలో తీవ్ర గాయాలయ్యాయి. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా బోనకల్లు గ్రామంలో స్వల్ప వివాదంలో ఆ గ్రామానికి చెందిన కొందరు కొదమల శ్రీకాంత్‌ను గాయపర్చగా...తెలంగాణ రాష్ట్రం బోనకల్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. నొప్పులతో బాధపడుతున్న శ్రీకాంత్‌ను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ శుక్రవారం శ్రీకాంత్ ఇంటికి వెళ్లి పరామర్శించారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

ఇంధన పొదుపును అలవర్చుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపును అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు కోరారు. ఈనెల 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక లక్ష్మీ టాకీస్ సెంటర్ వద్ద ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో ఇంధన పొదుపు మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్ వినియోగదారులకు ఇంధన పొదుపు పట్ల అవగాహన కల్పించేందుకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సమర్పించారు. ఇంధన పొదుపు చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో జి20 సదస్సు సందర్భంగా కేంద్ర ప్రభుత్వం బెటర్ లైఫ్ అంశంతో మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా పర్యావరణహిత కార్యక్రమాలు ప్లాస్టిక్ బ్యాన్, సింగిల్ యూస్ ప్లాస్టిక్ ఇంధన పొదుపు వంటి 7 అంశాలపై కార్యక్రమాలు చేపట్టిందన్నారు. విద్యుత్ వస్తువుల వినియోగం పెరుగుతున్న కొద్దీ విద్యుత్ వినియోగం పెరుగుతోందన్నారు. బొగ్గు నుండి విద్యుత్ ఉత్పత్తి ఎక్కువగా చేస్తున్నామని, వీటితోపాటు ప్రత్యామ్నాయ ఇంధన వనరులు సోలార్, విండ్, హైడ్రోపవర్ కూడా ఎక్కువగా ఉత్పత్తి వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ ఉత్పత్తిలో వివిధ రకాల గ్యాసేస్ విడుదలై పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుందని, తద్వారా మానవ మనుగడకే ముప్పు ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉపద్రవాల నుండి బయట పడాలంటే ఇంధన పొదుపు ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు అలవర్చుకోవాలని సూచించారు. ప్రకృతి ప్రసాదించిన వనరులు సద్వినియోగం చేసుకోవడంతో పాటు సహజ సిద్ధ వాతావరణంలో జీవనాన్ని సాగించేలా భావితరాలను కాపాడేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, యువ నాయకులు పేర్ని కిట్టు, మార్కెట్ యార్డ్ చైర్మన్ అచ్చాబా, థామస్ నోబుల్ ఇంధన పొదుపు ఆవశ్యకత గురించి ప్రసంగించి పలు సూచనలు చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చంద్రయ్య, విద్యుత్ శాఖ ఈఈ భాస్కరరావు, విద్యుత్ శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెట్ల పెంపకానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

ఈనెల 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో సంబంధిత కనీసం 75 అనువైన ప్రదేశాలలో మడ మొక్కల పెంపకం పునరుద్ధరణ కేంద్ర ప్రభుత్వంచే ప్రవేశ పెట్టబడుతుందని జిల్లా అటవీశాఖ అధికారి కె. రాజశేఖర రావు తెలిపారు. సిఎఎంపిఎ, ఎంజిఎన్ఆర్ ఈజీఎస్ పథకాలతో మడ అడవులు ప్రోత్సాహం, సంరక్షణ 2023-24 యూనియన్ బడ్జెట్లో మిష్టీ (మిషన్ మంగ్రోవ్ ఇనీషియేట్ ఫర్ షోర్ లైన్ హ్యాబిటాట్స్ అండ్ టాంజిబుల్ ఇన్కమ్) కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మిష్టీ కార్యక్రమం (మడ మొక్కల పెంపకం పునరుద్ధరణ) ప్రారంభిస్తారన్నారు. పూర్తి కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారంతో వీక్షించే విధంగా గిలకలదిండిలో ఏర్పాట్లు చేశామన్నారు. బందరు



ఎంపి వి. బాలశౌరి, మాజీ మంత్రి, బందరు శాసన సభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని), జిల్లా కలెక్టర్ రాజ బాబు, మేయర్ మోకా వేంకటేశ్వరమ్మ పాల్గొంటారని తెలిపారు. తదుపరి మడ జాతి మొక్కలు కార్యక్రమంలో పాల్గొన్న వివిపిలు నాటే ఏర్పాట్లు చేశామన్నారు. దీనిలో భాగంగా 5 హెక్టారుల విస్తీర్ణంలో మడ జాతి మొక్కలు పెంపబడతాయని చెప్పారు. మిగిలిన ప్రాంతాలలో 5 ఏళ్ళలో మడ అడవులను విస్తరింపచేసి, తీర ప్రాంత ప్రజలకు జీవనోపాధి కలిపిస్తూ, ప్రకృతి వైపరీత్యాల నుండి ముప్పు వాటిల్లకుండా భావితరాలకు ఉపయోగకరంగా అభివద్ధి చేయ్యటం జరుగుతుందని స్పష్టం చేశారు. మడ అడవుల చొరవ, తీరప్రాంత నివాసాలు, ప్రత్యక్ష ఆదాయాల కోసం మిష్టీ ప్రవేశ పెట్టారని తెలిపారు. దీంతో ఐదు ఏళ్ళలో 2023-28 లో తొమ్మిది తీరప్రాంత రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాలలో సుమారు 540 చదరపు కిలో మీటర్లు విస్తరింప చేయాలని ఉద్దేశం ఉందన్నారు.

రహదారి పనులు ప్రారంభించిన జెడ్పీటీసీ

ప్రజాశక్తి-చల్లపల్లి

చల్లపల్లి మండలం పురిటిగడ్డ పంచాయతీ శివారు నిమ్మగడ్డ ఎస్సీ కాలనీలో నూతన రహదారి నిర్మాణ పనులను జడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి శుక్రవారం ప్రారంభించారు. జడ్పీచైర్ పర్సన్ ఉప్పాల హారిక, జడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి సహకారంతో రూ.6లక్షలు జడ్పీ నిధులు మంజూరు చేయగా ఈ రోడ్డు నిర్మాణం చేపట్టారు. వైసీపీ రాష్ట్ర నాయకులు రాజులపాటి శివప్రసాద్, జడ్పీటీసీ రాజులపాటి కళ్యాణి, సర్పంచ్ మాతంగి రమ్య, వైసీపీ నేత గోవాడ మోహనరావు, విజయకుమారి, పఠాన్, భద్రి, నాగబాబు, వీరబాబు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

తొలి రోజు ప్రశాంతం : డిఇఒ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణాజిల్లాలో పదో తరగతి సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు శుక్రవారం నిర్వహించిన పేపర్-1 పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖాధికారిణి తాహెర సుల్తానా తెలిపారు. మొత్తం 33 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. తొలి రోజు 2210 మంది విద్యార్థులకు గాను 1564 మంది హాజరయ్యారన్నారు. 646 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. హాజరు శాతం 70.77 శాతం నమోదైందని తెలిపారు. నాలుగు ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 12 పరీక్షా కేంద్రాలను సందర్శించగా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదన్నారు.

వికలాంగుల సంక్షేమ శాఖ ఎడిగా వి.కామరాజు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులుగా వి.కామరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు సహాయ సంచాలకులు గా చేసిన బి.రామ్ కుమార్ కాకినాడ జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో కాకినాడ జిల్లాలో సహాయ సంచాలకులుగా పనిచేస్తున్న వి.కామరాజును



కృష్ణాజిల్లాకు కేటాయిస్తూ ఆ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేయడంతో కామరాజు బాధ్యతలు చేపట్టారు. తొలుత జిల్లా కలెక్టర్ పి.రాజాబాబును మర్యాద పూర్వకంగా కలిసి అనంతరం బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన కామరాజు కార్యాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

చెస్ ఆటలో శిక్షణ

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖనంతో పాటు చెస్ ఆటలో కూడా మెలుకువలు నేర్పించారు.



ఉపాధ్యాయులు సిహెచ్ వినుకొండయ్య చిత్రలేఖనం లో విద్యార్థులకు మెలకువలు నేర్పించారు. చెస్ ఆటలో మెల్వవులు డాన్స్ పాటలు, పాడడం, ఇంగ్లీష్ గ్రామర్ తదితర అంశాలపై విద్యార్థులకు బోధించారు. వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవటం ద్వారా విద్యార్థులు మరింత జ్ఞానాన్ని పొంపొందించుకోవచ్చునని అతిథులు పేర్కొన్నారు. ఏటేటా ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటుచేయటం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సీతారాం తదితరులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి జే.ప్రభుదాస్ కార్యక్రమాన్ని పరిరక్షించారు. కార్యక్రమంలో పాటకులతోపాటు గ్రంథాలయ సిబ్బంది కృపారావు తదితరులు పాల్గొన్నారు.

బాలలతో పని చేయిస్తే జైలుకే : కలెక్టర్

విజయవాడ: 14 ఏళ్లలోపు బాలలతో పని చేయించుకునే వారిపై బాల కార్మిక నియంత్రణ చట్టం 1986 కింద కేసులు పెట్టి శిక్ష విధించినప్పుడే బాలల భవితను కాపాడుతామని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. బాల కార్మికుల చట్టం అమలుపై సంబంధిత అధికారులతో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా రూపొందించడంలో అధికారులు సమర్థవంతంగా కృషి చేయాలన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రభుత్వం 1986లో చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. 14 సంవత్సరాల్లోపు బాలబాలికలను పనిలో పెట్టుకుని పనులు చేయిస్తే అటువంటి వారిపై బాలకార్మిక నిషేద చట్టం సెక్షన్ 14 (1) కింద కేసు నమోదు చేస్తే 6 నెలల నుండి 2 సంవత్సరాల వరకు జైలు శిక్ష, 20 వేల రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. 15 సంవత్సరాలు నుండి 18 సంవత్సరాల వయసు గల బాలబాలికలతో గనులు, ప్రమాదకరమైన పరిశ్రమలు, మండే స్వభావం గల పదార్థాల వినియోగ కేంద్రాలలో పని చేయిస్తే చైల్డ్ అండ్ అడాలసెంట్ లేబర్ ప్రొహిబిషన్ అండ్ రేగ్యులేషన్ చట్టం 1986 సవరణ చట్టం 2016 మరియు రూల్స్ 2017 కింద కఠిన శిక్ష విధించే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఈ నెల 30వ తేది వరకు కార్మిక, పోలీస్, రెవెన్యూ, చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల టాస్క్‌ఫోర్స్ బృందం జిల్లాలో బాల కార్మికులను గుర్తించి, యాజమానులపై కేసులను నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా ఇటీవల పాఠశాలలకు



వేసవి సెలవులు ప్రకటించిన తర్వాత 14 సంవత్సరాల్లోపు బాల బాలికలు కొన్ని దుకాణాలలో పనిచేస్తున్నట్లు కార్మిక శాఖ అధికారుల వద్ద సమాచారం ఉన్నట్లు ఇటీవల జరుగుతున్న కొన్ని దాడులు తెలుపుతున్నాయన్నారు. బాలలతో పనిచేయిస్తున్నట్లు గమనిస్తే చైల్డ్‌లైన్ 1098కి సమాచారం అందించేలా ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు.



తిరువూరులో జయకృష్ణ ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-తిరువూరు: పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యాధునిక సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయిలో ఆసుపత్రిని నిర్మించటం ఎంతో అభినందనీయమని విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. తిరువూరు బోసుబొమ్మ సెంటర్‌లో డాక్టర్ పెనుమల్లి నాగే శ్వరరావు నూతనంగా నిర్మించిన జయకృష్ణ ఆసుపత్రిని ఎంపి, ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్యలు విడివిడిగా వచ్చి ప్రారంభించారు. ముందుగా వచ్చి ప్రారంభించిన ఎంపీ కేశినేని మా ట్లాడుతూ డాక్టర్ చదివి సంపాదన కోసం పెద్ద నగరాలకు, విదేశాలకు వెళ్తు న్న ఈరోజుల్లో డాక్టర్ నాగేశ్వరరావు పుట్టిన ప్రాంతంలో ఆసుపత్రి స్థాపించి పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవ లు చేయటం చాలా సంతోషమన్నా రు. ఏవిధమైన వైద్య సేవలు చేయటం వల్లనే తక్కువ సమయంలో మంచి డాక్టర్ గా పేరు తెచ్చుకున్నారని కేశినేని అభినందించారు. టాటా ట్రస్ట్ ద్వారా గతంలో కూడా డాక్టర్ నాగేశ్వరరావు పేదలకు వైద్య సేవలు అందించారని గుర్తుచేశారు. ఆసుపత్రి ప్రారంభోత్స వానికి వందలాది మంది ప్రజలు స్వ చ్ఛందంగా తరలి వచ్చారంటే ఆయన ఎంత మంచి డాక్టరో అర్థమవుతుందని కొనియాడారు. ఈకార్యక్రమంలో మాజీ మంత్రి కె.జవహర్, మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాస్, టిడిపి నాయ కులు తాళ్లూరి రామారావు, సుంకర కష్ణమోహన్ రావు, ఎంపిపి గద్దల భారతి, నగర పంచాయతీ చై ర్ పర్సన్ గత్తం కాస్తూరిభాయి, ఎఎంసి చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

ప్రజాశక్తి-నందిగామ

చందర్లపాడులో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అధికారులు సిఐ ఇంద్రజిత్తు, ఎస్సై శ్రీనివాస్ వారి సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. 101 తెలంగాణా మద్యం సీసాలను ముగ్గురు వ్యక్తులు మద్యం సప్లై చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

దాసరి కామేశ్వరావు కుటుంబానికి దేవినేని ఉమా పరామర్శ

విజయవాడ రూరల్: ప్రముఖ సీనియర్ పాత్రికేయులు దాసరి కామేశ్వరరావు కుటుంబ సభ్యులను నున్నలోని వారి నివాసంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరావు శుక్రవారం పరామర్శించారు. కామేశ్వరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిజానికి నిజమైన భాష్యం చెప్తూ, పత్రికా రంగంలో గొప్ప మనసున్న వ్యక్తిగా కామేశ్వరావు పేరు ప్రఖ్యాతలు సంపాదించారన్నారు. ఆయన మరణం పత్రికా రంగానికి తీరని లోటన్నారు. ఈనాడు, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ప్రజాశక్తి దినపత్రికల్లో జర్నలిస్టుగా పనిచేసిన కామేశ్వరరావు ది విజయవాడ జర్నలిస్ట్స్ మ్యూచివల్లీ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సభ్యునిగా కూడా ఉన్నారని ఆయన గుర్తు చేశారు.



రవాణా శాఖలో మెరిట్ ప్రకారం ప్రమోషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న సుదర్శనం

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: రవాణాశాఖలో రోస్టర్ కమ్ మెరిట్ ప్రకారం ప్రమోషన్స్ ఇవ్వాలని దళిత జేఏసీ నేత ,సమతా సైనిక దళ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట అధ్యక్షులు బేతళ సుదర్శనం డిమాండ్ చేశారు.శుక్రవారం గవర్నర్ పేటలోని అంబేద్కర్ భవన్ లో దళిత జెఏసి ఆధ్వర్యంలో రవాణాశాఖ లోని అవకతవకలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రవాణా శాఖలో రోస్టర్ కమ్ మెరిట్ ప్రాతిపదికన కాకుండా ఉద్యోగులు ప్రమోషన్స్ కేవలం మెరిట్ ప్రాతిపదికన ఇస్తున్నారని మెరిట్ కమ్ రోస్టర్ రిజిస్టర్ అనేది ఎస్సీ ఎస్టీ బీసీ పీహెచ్ లకు కేటాయించిన రోస్టర్ ప్రకారం, రిక్రూట్ మెంట్లో మెరిట్ ర్యాంక్ డేట్ అఫ్ బర్త్ సహాయంతో తయారు చేయబడిన ప్రమోషన్ రిజిస్టర్ అని అన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర , సబార్డినేట్ సర్వీస్ రూల్స్, 1996లోని రూల్ 22, 22ఎ నిబంధనలు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన కులాలు, మహిళలు, శారీరక వికలాంగ అభ్యర్థులు రోస్టర్ విధానం ప్రకారం చేయలని వాటిని తుంగలోనికి తోక్కి మెరిట్ విధానం అంటు యస్సి,యస్టీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.ఈ రిజర్వేషన్ ఆఫ్ రూల్ ఉల్లంఘ విషయం పై శాఖ సెక్రెటరీ గారికి ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. .ఈ కర్యక్రమంలో ఆలిండియా ఎరుకల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మోహన్ కుమార్ ధర్మ,ఎస్సీ, ఎస్టీ బిసి ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రెటరీ స్వరూప్ దత్,బహుజన సంఘర్షణ సమితి నాయకులు చర్చిల్ న్యాయవాది రవీంద్ర జోజి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



గ్రూప్ టెంపుల్స్ ఇఒగా సీతారామయ్య

ప్రజాశక్తి-నందిగామ

నందిగామ, జగ్గయ్యపేటలో గల పలు దేవాలయాలకు కార్యనిర్వహణాధికారిగా పామర్తి సీతారామయ్య నియామకమయ్యారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు నందిగామలో పనిచేస్తున్న కె.నాగరాజు విజయవాడ బదిలీ అయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసి అవనిగడ్డలో ఈవోగా పనిచేస్తున్న పామర్తి సీతారామయ్య కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం గ్రూప్ టెంపుల్ ఈవోగా బాధ్యతలు చేపట్టారు.

కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-నందిగామ

16వ వార్డులో సమస్యలు పరిష్కారానికి కషి చేయాలని నందిగామ మున్సిపల్ కమిషనర్ ఎస్ జయరాం సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఉదయం నందిగామ పట్టణ 16 అవార్డులు మున్సిపల్ కమిషనర్ ఎస్ జైరామ్ పర్యటించారు. డ్రైనేజీలు పూడిక పోవడం వల్ల రోడ్డుపై మురుగునీరు పారుతుందని ప్రజల ఫిర్యాదు చేశారు. మంచినీరు వారానికి ఒకసారి వస్తుందని ప్రతిరోజు మంచినీరు సరఫరా చేయాలని ప్రజలు ఆయన దష్టికి తీసుకువచ్చారు. అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని శానిటేషన్ సక్రమంగా లేదని డ్రైనేజీలు లేకపోవడం వల్ల ఇళ్లల్లో మురుగునీరు రోడ్లమీద వదులుతున్నారని తక్షణమే శానిటేషన్ చేపట్టాలని ప్రజలు కమిషనర్ను కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసీపీ వార్డు ఇన్చార్జి అచ్చి చిన్న బాబు, ఇన్చార్జి శానిటరీ ఇన్స్పెక్టర్ గురునాథం, వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ పలువురు అధికారులు పాల్గొన్నారు.



జలజీవన్ మిషన్ పనులపై అసంతృప్తి

ప్రజాశక్తి-మైలవరం: మండలంలోని పొందుగలలో కేంద్ర జలజీవన్ మిహన్ కింద జరుగుతున్న పనుల నిర్వాహణ పట్ల పంచాయతీరాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ తన అసంతప్తిని వెళ్లగక్కారు. శుక్రవారం పొందుగ పంచాయతీలో ఆకస్మికంగా పర్యటించి జలజీవన్ మిషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరాను పరిశీలించి నిర్వాహణ పనితీరుపై మండిపడ్డారు. గ్రామ పారిశుధ్య నిర్వాహణ కమిటీని జలజీవన్ మిషన్ గురించి పలు ప్రశ్నలు అడిగి వారి సమాధానం పట్ల తన అసంతప్తిని వ్యక్తం చేశారు.పనులు ఈ విధంగా ఉంటే ఈ నెల 6న కేంద్ర బందం (కమిటీ) గ్రామానికి రానుందని,పనులు పరిశీలనకు వస్తే ఏం సమాధానం చెబుతారని



మండిపడ్డారు.గ్రామంలో పారిశుధ్య నిర్వహణను సక్రమంగా నిర్వహించాలని కింది స్థాయి అధికారులకు చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఆదేశించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అతిధి సింగ్ గ్రామస్తులకు పలు సూచనలు చేశారు.

భావితరాల భవిష్యత్తు కోసమే దీక్ష : నాగరాజన్

ప్రజాశక్తి-భవానీపురం: భావితరాల భవిష్యత్తు కోసమే ఆమరణ నిరాహార దీక్ష చేపట్టానని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజు తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా తాను నెలరోజులపాటు ఆమరణ నిరాహార దీక్షకు అనుమతి కొరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు, పోలీస్ అధికారులను కలిసి విన్నవించినా సరైన



సమాధానం రాకపోవడంతో శుక్రవారం ఊర్మిళానగర్‌లోని ట్రస్ట్ కార్యాలయం వద్ద గాంధీ నాగరాజన్ ఆమరణ నిరాహార దీక్షకు పూనుకున్నారు. తొలుతగా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా గాంధీ నాగరాజన్ మీడియాతో మాట్లాడుతూ నేటి పాలకుల తీరు చాలా దారుణంగా ఉందన్నారు. స్వేచ్ఛ సమానత్వాలు అందరికీ సమకూర్చలేనప్పుడు మౌనంగా బ్రతికితే అది బానిస బతుకులు అవుతాయని నాగరాజన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో, హాస్టళ్ళల్లో గోరు ముద్ద పేరుతో ప్రభుత్వం రేషన్ బియ్యంతో అందిస్తున్న భోజనం పురుగులు మయంగా ఉండటంతో అదే భోజనాన్ని పిల్లలకి పెట్టడం చాలా బాధాకరమన్నారు. విడిపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. దీనివల్ల భావితరాల భవిష్యత్తు అంధకారం మయంగా తయారైందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు జరగలేదన్నారు. బాలల భవిష్యత్తే భావితరాల భవిష్యత్తు అని, ప్రజల రక్షణే ప్రజాస్వామ్య పరిరక్షణ అన్నారు. ఇది గాంధీ యిజమా, రౌడీయిజమా అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రసాజ్వామ్య బద్ధంగా, శాంతియుతంగా ప్రజలు, భావితరాల యువత కోసం తాను చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష అడ్డుకుని, భగ్నం చేయాలని పాలకులు, పోలీసులు ప్రయత్నిస్తే జైలులో కూడా దీక్ష చేపడతానని నాగరాజన్ పేర్కొన్నారు.